ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఫిబ్రవరి 2024

సోమశిలలో 17.745 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 26 : సోమశిల జలాశయంలో నీటినిల్వ పడిపోతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం 17.745 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఫ్లస్ తుస్!

ప్రశ్నార్థకంగా ఇంటర్ బాలికా కళాశాలలు

అధ్యాపకులు లేరు.. పుస్తకాలు లేవు...

పూర్తయిన విద్యా సంవత్సరం

మార్చి 1 నుంచి ఇంటర్ ప్రధాన పరీక్షలు

విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో అయోమయం

కూర్చునేందుకు తగినన్ని గదుల్లేవు.. బోధకుల నియామకం చేపట్టనేలేదు. పాఠ్యపుస్తకాలూ ఇవ్వలేదు. ప్రయోగశాల ఊసేలేదు. అయినా హడావుడి చేసి బాలికలను చేర్పించేశారు. జిల్లాలోని ఉన్నతీకరించిన 13 ఉన్నత పాఠశాలల్లోని ఇంటర్ విద్యార్థినుల పరిస్థితి ఇది. పాఠ్యపుస్తకాలు, అధ్యాపకులు లేకుండానే ఏడాది అంతా అతికష్టంగా పూర్తి చేశారు. ఇప్పుడు కీలకమైన ప్రధాన పరీక్షలు సమీపిస్తుండటంతో ఇటు విద్యార్థినులు, అటు తల్లిదండ్రుల్లో గుబులు మొదలైంది.



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 26 : బాలికల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 13 ఉన్నత పాఠశాలల్లో బాలికల జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో కనీసం రెండింటిని ఎంపిక చేసుకుని ప్రవేశాలు చేపట్టారు. అల్లూరు, ఆత్మకూరు, బోగోలు, ఇందుకూరుపేట, జలదంకి, కలువాయి, కొడవలూరు, మనుబోలు, ముత్తుకూరు, నెల్లూరు, సంగం, ఉదయగిరి, విడవలూరులలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్పు చేసి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 91 మంది, బైపీసీలో 40, సీఈసీలో 75 మంది అడ్మిషన్లు పొందారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 35, బైపీసీలో 25, సీఈసీలో 8 మంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారు. మొత్తం మీద ప్రథమ సంవత్సరంలో 206, ద్వితీయ సంవత్సరంలో 69 మంది కలిపి మొత్తం 275 మంది విద్యార్థులు 1వ తేదీ నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు.

● బోధన లేకుండానే..

ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా మార్పు చేయడం కాగితాలకే పరిమితమైంది. ఒక్క కళాశాలలో కూడా అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదు. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు చేపట్టడంతో ఆలస్యంగా విద్యా సంవత్సరం ప్రారంభించారు. విద్యార్థుల జీవితానికి ఇంటర్ ఎంతో కీలకమైన నేపథ్యంలో ప్రభుత్వం అలసత్వంతో పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్, ఇంజనీరు, శాస్త్రవేత్త ఇలా ఏది కావాలన్నా ఇంటర్ విద్యే ప్రధానమని, పోటీతత్వంతో ఉండే ఈ దశను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. అధ్యాపకులు, పుస్తకాలు, వసతులు లేకుండానే ఏడాదంతా గడిచిపోవడంతో 1వ తేదీ నుంచి జరిగే వార్షిక పరీక్షలు ఎలా రాయాలో తెలియక విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. హైస్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తూ పీజీలు చేసిన ఉపాధ్యాయులు కొంతమందిని బోధనకు నియమించినా మొక్కుబడిగానే తరగతుల నిర్వహణ జరిగినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. కనీసం పాఠ్య పుస్తకాలను కూడా అందించకపోవడంతోనే తెలిసిన వారి దగ్గరో, సీనియర్స్ వద్ద పాత పుస్తకాలను తెచ్చుకుని చదువుకున్నారని తెలిపారు. అత్యధిక కళాశాలలో ఈ బోధనలు కూడా జరగలేదని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో తమ పిల్లలు ఉత్తీర్ణత సాధిస్తారో లేదోనన్న దిగులు తల్లిదండ్రుల్లో నెలకొంది.

హద్దుల్లేని పద్దు!

రానున్న ఆర్థిక సంవత్సరానికి భారీ అంచనాలతో పద్దును సిద్ధం చేసిన నగర పాలక సంస్థ నగరవాసులపై ఆర్థిక భారానికే తొలి ప్రాధాన్యమిచ్చింది. ప్రజలకు ఆర్థిక ఉపశమనాన్ని ఎక్కడా కనబరచని యంత్రాంగం అన్ని వనరులను ఆదాయం వైపే మళ్లించింది. రూ.437,01, 85,000లతో 2024-25 పద్దును సిద్ధం చేసిన అధికారులు 54 డివిజన్లలోని అన్ని అవకాశాలను పన్నుల రూపేణా ప్రజల నుంచి వసూలు చేసేందుకు సిద్ధపడ్డారు. రాయితీలు, ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా పక్కన పెట్టి ఖజానా నింపుకోవడానికే దృష్టంతా సారించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ స్రవంతి అధ్యక్షతన పద్దును అధికారికంగా ప్రవేశపెట్టనున్నారు.





- ● రూ.437.01 కోట్లతో నగరపాలక సంస్థ బడ్జెట్
- ● అన్ని వనరులు ఆదాయం వైపే మళ్లింపు
- ● ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలకూ పన్ను
- ● నగరవాసులకు ఉపశమనం లేకుండా బాదుడు
- ● రేపు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 26 : ప్రణాళికా వ్యయం రూ.243,62,85,000లతోపాటు ప్రణాళికేతర వ్యయం రూ.193.39 కోట్లు కలుపుకుని బడ్జెట్‌ను తయారు చేసిన కార్పొరేషన్ యంత్రాంగం కొత్త ఆర్థిక సంవత్సరానికి పద్దును బుధవారం బడ్జెట్ కౌన్సిల్ సమావేశం ప్రవేశపెట్టనుంది. ప్రారంభ నిల్వతో కలుపుకుని వివిధ మార్గాల ద్వారా రూ.444.88 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు ఆదాయం సమకూరుతుందని లెక్కగట్టారు. ఇందులో పై మొత్తాన్ని ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల కింద ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు బడ్జెట్ సమావేశంలో ప్రకటించనున్నారు. కాగ నెల్లూరులోని ప్రజలపై ఆర్థిక భారాలను అమాంతం పెంచేసిన పాలకవర్గం ఎక్కడా ఉపశమనం కలిగించకపోవడం గమనార్హం. ఆస్తి పనుల ద్వారా రూ.71 కోట్లు, ఖాళీ స్థలాలపై రూ.8 కోట్లు పన్నుల రూపేణా వసూలు చేయనున్నారు. ఇక వాణిజ్య సముదాయాలపై ట్రేడ్ చార్జీల పేరుతో ఏకంగా రూ.3.50 కోట్ల వసూలుకు టార్గెట్‌గా పెట్టుకున్నారు. అలాగే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నందుకు కూడా పన్నులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. బిల్డింగ్ ప్లాన్లు జారీ చేసేందుకు రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.35 కోట్ల వరకు వసూళ్లు చేయాలని భారీ లక్ష్యం పెట్టుకున్నారు. తాగునీటి సరఫరాపై రూ.9 కోట్లు, కొళాయిలకు మీటర్లు పెట్టి రూ.5 కోట్లు వసూళ్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇక లేఅవుట్ల రెగ్యులరైజ్ చేసే ఫీజుల ద్వారా రూ.15 కోట్లు రాబట్టాలని పద్దులో నిర్ణయించారు.



ముస్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి

తీరు మారదేం!

● ఆత్మకూరులో వైసీపీ రెబల్ కౌన్సిలర్ నిరసన

ఆత్మకూరు, ఫిబ్రవరి 26 : 'మీరు మారరా!?. మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు వివరాలు ఇవ్వాలని ఎన్నిసార్లు అడగాలి!? స్పందించకపోతే ఎలా!?' అంటూ ఆత్మకూరులో వైసీపీ రెబల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తన అనుచరులతో కలిసి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ బైఠాయించి అధికారుల తీరుపై మండిపడ్డారు. మున్సిపల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, కౌన్సిలర్లకు తెలియకుండానే కొన్ని అంశాలను తీర్మానించినట్లు రికార్డుల్లో పొందుపరిచారని విమర్శించారు. సమాచార హక్కు చట్టం కింద ఈ విషయాలన్నీ కోరినా పట్టించుకోలేదని మండిపడ్డారు. రెండువారాల క్రితం కమిషనర్ ఇచ్చిన హామీ కూడా నెరవేర్చుకోలేక పోయారని అన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి : యూటీఎఫ్

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 26 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులకు 58 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులకు, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఉన్నవారికి, మహిళలకు మినహాయింపు ఇవ్వాలని యూటీ ఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో సమస్యలున్న వారికి ఎన్నికల విధుల నుంచి ఉపశమనం కలిగించాలన్నారు. దీనిపై ఉన్నతాధికా రులు చొరవ తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, ఉపాధ్యక్షు డు ఎంసీ.అ చ్చయ్య, కోశాధికారి ఏ.మురళీధర్‌రావు, కార్యదర్శు లు నాగిరెడ్డి, ఖాజావలి, సురేంద్ర బాబు, నేతలు పాల్గొన్నారు.

కట్టుకున్నోడినే

కడతేర్చింది!

భర్త ప్రాణాల కోసం యముడితో పోరాడిన మహిళల చరిత్రలు చదువుకున్నాం.. ఎంతో సహనంగా, ఓర్పుగా ఉండే మహిళ తన భర్త జోలికొస్తే మహంకాళిగా మారి రాక్షస సంహారానికైనా వెనుకాడదన్న కథలు విన్నాం. అయితే, స్నేహితుడి కోసం అతికిరాతకంగా భర్తను హత్య చేయించిన ఓ భార్య ఉదంతమిది. నెల్లూరులోని నవాబుపేట రామచంద్రాపురంలో ఈ నెల 18వ తేదీ అర్ధరాత్రి జరిగిన హత్య కేసును నవాబుపేట పోలీసులు ఎంతో చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసు పూర్వాపరాలను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సోమవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు.

- ప్రియురాలి కోసం ఓ ప్రబుద్ధుడి ఘాతుకం
- కిరాతకంగా కత్తులతో పొడిచి హత్యచేసిన వైనం
- నెల్లూరులో హత్యకేసును ఛేదించిన పోలీసులు
- భార్య సహా ఏడుగురి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 26 : నెల్లూరులోని రామచంద్రాపురం రామాలయం వీధికి చెందిన ఎం నరసింహులు, కాంతమ్మ ల కుమారుడు పెంచల ప్రసాద్ (35)కు తన పెద్ద అక్క ప్రసన్న కుమార్తె సుహితతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పెంచల గౌతమ్, పెంచల విహాంత్ కుమారులు. ట్రక్కు ఆటో నడుపు తూ ప్రసాద్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో పెంచల ప్రసాద్ ఇంట్లో ఉండగా హత్యకు గురయ్యాడు.

● ఫోన్లో టాకింగ్.. చాటింగ్

తన బావ పెంచల ప్రసాద్‌ను పెళ్లి చేసుకోవడం సుహితకు ఇష్టం లేదు. అయిష్టంగానే ఇద్దరూ సంసారం చేస్తూ నిత్యం గొడవలు పడుతుండే వారు. కాగా, ప్రసాద్ ఉంటున్న ప్రాంతంలోనే పెంచల వరప్రసాద్ అలియాస్ వరలు మంచి స్నేహితులు. వరప్రసాద్ తరచూ ప్రసాద్ ఇంటికి వెళ్లి వస్తుండటంతో సుహితతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్లో మాట్లాడుకోవడం, చాటింగ్ చేసుకునేవారు. ఈ విషయం పెంచల ప్రసాద్‌కు తెలియడంతో వరప్రసాద్‌ను కొట్టి తన భార్యతో దూరంగా ఉండాలని బెదిరించాడు. ఈ విషయంపై ఇద్దరికి పలు మార్లు తగాదాలు జరిగాయి. దీంతో ప్రసాద్‌పై వరప్రసాద్ కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా తన భర్తను అడ్డు తొలగించుకోవాలని సుహిత కూడా నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని వర ప్రసాద్‌కు చెప్పింది.

● అంతా పథకం ప్రకారమే..

ప్రసాద్‌ను హత్య చేసేందుకు నిర్ణ యించుకున్న వరప్రసాద్ తన స్నేహితు లు ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన దుర్గా సాగ ర్, అల్లీపురానికి చెందిన ఇనుకుర్తి వెంక టసాయి, రామచంద్రాపురానికి చెందిన పడినాకర్ మనోహర్ అలియాస్ మనో, వేలు లివింగ్‌స్టన్, బొగ్గవరపు నాగేంద్ర బాబు అలియాస్ చింగ్‌చాంగ్, నిరీక్షణ్, పసుపులేటి పెంచలయ్య అలియాస్ పవన్ కుమార్‌లకు విషయం తెలియజేశారు. 18వ తేదీ రాత్రి ఇంట్లో ఎవరూ ఉం డరని, తన భర్తను హత్య చే సేందుకు ఇదే సరైన సమ యమని వరప్రసాద్‌కు సుహిత ముందుగా ఫోన్ ద్వారా తెలియజేసింది. అనుకున్న ప్రకారం రాత్రి ప్రసాద్ ఇంట్లో నిద్రపోయిన తర్వాత లోపల గడియ పెట్టకుండా సమాచారాన్ని వరప్రసా ద్‌కు తెలియజేసింది. వెంటనే తన స్నేహితులతో వరప్రసాద్ ఇంట్లోకి ప్రవే శించాడు. నిద్రిస్తున్న ప్రసాద్‌ను కదలకుండా పట్టుకొని కత్తులతో విచక్షణా రహితంగా పొడిచాడు. అతడు మృతి చెందాడని నిర్ధారిం చుకున్న తర్వాత మృతుడి మొబైల్ తీసుకొని పరారయ్యారు.



నిందితుల (ముసుగులో ఉన్న వ్యక్తులు) వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

● పోలీసుల చాకచక్యం

మృతుడు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ బాబి హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు తొలుత మృతుడి భార్య సుహితను ప్రశ్నించారు. విచారణలో ఆమె చెబుతున్న విషయాలు, ఆమె ప్రవర్తన పోలీసులకు ఆశ్చర్యం కలిగించాయని, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి నుంచి కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో మృతుడి భార్యతోపాటు ఆరుగురిని అరెస్ట్ చేశామని నిరీక్షణ్, పసుపులేటి పెంచలయ్యను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఎం బాబి, ఎస్‌ఐలు రహిమాన్, చంద్రావతి, జోజి, హెడ్‌కానిస్టేబుల్ పవన్‌కుమార్, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.



కందుకూరు ప్రాంతంలో ఎండుముఖం పట్టిన పప్పుశనగ

బెట్టకొచ్చిన పప్పుశనగ

● పక్వానికి రాకముందే పండిపోతున్న కాయలు ● దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం

కందుకూరు, ఫిబ్రవరి 26 : ఈ ఏడాది పప్పుశనగ సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. పూత, పిందె దశలో ఏపుగా పెరగాల్సిన పైరు బెట్టకొచ్చి పండిపోతున్నది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి చూస్తుంటే రబీలో కందుకూరు డివిజన్‌లో సాగుచేసిన పప్పుశనగ సాధారణ దిగుబడిలో సగం కూడా వచ్చే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. దిగుబడులు తగ్గటం ద్వారా ఈప్రాంతంలోని రైతులకు రూ.60 కోట్లకుపైగా నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. కాబూలీ రకం శనగలకు మంచి ధర ఉంది. ఈ ఏడాది శనగ సాగుచేస్తే లాభాలు కళ్లజూడవచ్చన్న ఆలోచనతో వేలకువేలు పెట్టుబడులు పెట్టి శనగ సాగుచేసిన రైతులు ప్రస్తుత పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు.

● సాగు ఆలస్యం

ఈ ఏడాది అదనులో పప్పుశనగ సాగుకి వాతావరణం అనుకూలించక పోవటం, వర్షాలు ఆలస్యం కావటంతో శనగ సాగు నెల ఆలస్యంగా జరిగింది. కందుకూరు నియోజకవర్గంలోని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో వేలాది ఎకరాల్లో రైతులు పప్పుశనగ సాగుచేశారు. గుడ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో కూడా రైతులు శనగ సాగుచేశారు. కందుకూరు సబ్ డివిజన్‌లోనే 12వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ ఏడాది శనగ సాగుచేశారు. కేవలం వర్షాధారంగా సాగుచేసే పప్పు శనగ పైరును సాధారణంగా నవంబరు మొదటివారం నుంచి మూడవ వారంలోగా సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయి. నవంబరులో కురిసిన వర్షాలకు నల్లనేలలు పూర్తిస్థాయిలో పదునైతే ఆ తేమతోనే శనగ పండుతుంది. మూడునెలలకాలంలో పంటకొచ్చే శనగ ఎండలు ముదిరేలోగా కోతలు, నూర్పిళ్లు పూర్తయితే ఎకరానికి 8 క్వింటాళ్ల సరాసరి దిగుబడి, అత్యధిక దిగుబడి పది క్వింటాళ్లవరకు వస్తుంది. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావటం డిసెంబరు మొదటివారం వరకు చెప్పుకోదగ్గ వర్షం కురవకపోవటంతో డిసెంబరు నెలాఖరులో రైతులు శనగ సాగుచేశారు. ఇప్పటికి 55 రోజులు మాత్రమే కాగా పూత, పిందె, కాయ దశలో ఉండాల్సిన పైరు భూమిలో తేమలేక పండిపోతోంది. దీంతో చెట్టుకు ఐదారు కాయలు మాత్రమే ఉండటంతో దిగుబడులు సగానికి సగం తగ్గిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాసిన కాయలు కూడా సరైన పోషకాలు అందక గింజ సైజు రావని దీనివల్ల కూడా దిగుబడి మరింత తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఎకరానికి నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదని, బాగా పండింది అనుకున్నా ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే అవకాశమే లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటాల్ పదివేలు వరకు ధర ఉన్నందున రూ.40 వేలు చేతికొస్తాయని అయితే ఎకరానికి పొలం కౌలుతో కలుపుకుని రూ.50వేలకుపైగా పెట్టుబడి పెట్టి సాగుచేసినందున నష్టపోక తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గొలుసు దొంగల అరెస్టు

● మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన మర్రిపాడు పోలీసులు


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణు

మర్రిపాడు, ఫిబ్రవరి 26: గొలుసు దొంగలను సోమవారం మర్రిపాడు పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోని టీ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మీ అనే మహిళ మెడలోని బంగారు సరుడును ఈ నెల 22వతేదీ రాత్రి నలుగురు వ్యక్తులు లాక్కొని కారులో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు తో ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి సిబ్బందితో కలిసి కేసును ఛేదించారు. నలుగురు నిందితులను పట్టుకున్నారు. ఆ వివరాలను మర్రిపాడు పోలీస్ స్టేషన్ లో ఆత్మకూరు సీఐ వేణు మీడియాకు వెల్లడించారు. పట్టుబడిన వారి నుంచి రూ.1,76,000 విలువ చేసే నాలుగు సవర్ల బంగారు సరుడు, అందుకు ఉపయోగించిన కారు, దొంగతనాల కు ఉపయోగించే వస్తువులు (ఇనుప రాడ్లు, స్పానర్లు, రించ్)లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి పట్టణానికి చెందినవారని, వారు అధికంగా టెలిఫోన్ కేబుళ్లు, బ్యాటరీలను చోరీ చేస్తుంటారని సీఐ తెలిపారు. వారిలో కొల్లిపర రూప శేషు అనే వ్యక్తిపై గంజాయి అక్రమ రవాణాతోపాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా కేసులున్నాయని చెప్పారు. నాగసాయి, చంద్ర మౌళి అనే నిందితులపై కూడా గంజాయి, సెల్ ఫోన్ల చోరీ కేసులున్నాయన్నారు. దుర్గారావు అనే వ్యక్తి తొలిసారి నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని సీఐ వెల్లడించారు.

అల్లూరులో చోరీ యత్నం

అల్లూరు, ఫిబ్రవరి 26: స్థానిక పొంగూరువారివీధిలోని ఓ ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ యత్నం జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న కోమట్ల వెంకట శేషారెడ్డి కుమార్తె కుటుంబం ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని బంధువుల వివాహానికి వెళ్లింది. గమనించిన దుండగులు చోరీకి ప్రయత్నించారు. తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అలమరల్లోని దుస్తులను చెల్లాచెదురుగా చేశారు. ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు ఏమీ లభించకపోవడంతో పప్పుల డబ్బాలను తీసుకెళ్లారు. అయితే ఈ చోరీపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా, ఈనెల 22న అల్లూరు మండలం బీరంగుంటలో ఒకే రోజు మూడు ఇళ్లల్లో చోరీ జరిగిన విషయం విదితమే. ఇలా వరుస చోరీలతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సెబ్ సిబ్బంది

ముత్తుకూరు, ఫిబ్రవరి 26: ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను సోమవారం సెబ్ అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నేలటూరు ప్రభుత్వ మద్యం దుకాణానికి చెందిన 236 మద్యం సీసాలను సూపర్‌వైజర్ అనిల్, సేల్స్‌మెన్ అశోక్ అక్రమంగా తరలిస్తుండగా మునునూరువారిపాలెం రహదారిలో సెబ్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితులను జ్యూడీషియల్ రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. అక్రమ మద్యం, మత్తు పదార్థాల రవాణా, విక్రయం, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని, కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ బాబు సతీష్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అసభ్య ప్రవర్తన కేసులో మూడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్), ఫిబ్రవరి 26 : ఏడేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడన్న కేసులో నేరం రుజువు కావడంతో షేక్ మస్తాన్ అనే నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... కొడవలూరు దర్గా సంఘానికి చెందిన నిందితుడు ఓ బాలికకు రూపాయి ఇచ్చి తన గుడిసెలోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కొడవలూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శైలజా రెడ్డి వాదించారు.

వైద్యం చేస్తామంటూ బురిడీ

● అమాయకుల నుంచి నగదు వసూళ్లు

● మోసపోయామంటూ పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధిత కుటుంబం

వరికుంటపాడు, ఫిబ్రవరి 26: అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తికి వైద్యం చేసి సంపూర్ణ ఆరోగ్యవంతంగా మారుస్తామని మాయ మాటలతో బురిడీ కొట్టించి నగదు వసూలు చేసుకొని పరారైన సంఘటన సోమవారం తోటలచెరువుపల్లిలో వెలుగు చూసింది. వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన చీలిపోగు నాగేశ్వరరావు కొంతకాలంగా పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఆ కుటుంబం మనోవేదనకు గురైన విషయం తెలుసుకున్న ఇద్దరు వ్యక్తులు ఈ నెల 13న నివాసానికి వెళ్లి తాము కేరళ నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యులమని, దేవుని సేవలో భాగంగా ఉచితంగా నయం చేస్తామని నమ్మబలికారు. ఆ సమయంలో నివాసంలో ఉన్న కుమార్తె నాగమణి ఇంట్లో ఎవరూ లేరని చెప్పడంతో వెళ్లిపోయారు. తిరిగి మరుసటి రోజు కుమారుడు నాగేంద్రకు మందు ఇస్తామని చెప్పి ఉదయగిరికి తీసుకెళ్లారు. అతని నుంచి రూ.20వేలు నగదు వసూలు చేసి ఓ సీసాలో మందు ఉందని చెప్పి అందజేశారు. అంతటితో ఆగని మాయగాళ్లు ఆ మరుసటి రోజు కూడా ఫోన్ చేసి వైద్యం చేసేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసిన దుకాణ యజమానికి సెల్ నంబరుకు రూ.3వేలు ఫోన్ పే చేయాలని సూచించడంతో ఆ వ్యక్తి నగదును ఫోన్ పే చేశాడు. రోజులు గడుస్తున్నప్పటికీ ఆచూకీ లేకపోవడంతో మోసపోయామంటూ బోరున విలపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగించే తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకున్నారు.

రవాణాశాఖ అధికారుల అసోషియేషన్

రాష్ట్ర అధ్యక్షుడిగా పూర్ణచంద్రరావు


నూతనంగా ఎంపికైన వారిని సన్మానిస్తున్న అధికారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 26: రవాణాశాఖ సాంకేతిక అధికారుల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సహాయ మోటార్ తనిఖీ అధికారి వైపీ పూర్ణచంద్రరావు, సలహాదారుగా కందుకూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి మొహమ్మద్ రఫీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని సోమవారం నగరంలోని డీటీసీ కార్యాలయంలో అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా డీటీసీ బీ చందర్ మాట్లాడుతూ జోనల్ స్థాయిలో రాష్ట్ర మూడవ జోన్ సెక్రటరీగా నెల్లూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్తీక్ పవన్‌కుమార్, జిల్లా ప్రతినిధిగా సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారి జి రఘువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో ఇన్‌చార్జ్ కొర్రపాటి మురళీమోహన్, కావలి ఆర్టీవో సుధాకర్‌రెడ్డి, మోటార్ వాహనాల తనిఖీ అధికారి బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	156
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5935
వెండి కిలో ధర	రూ. 71,800
వెండి ఒక గ్రాము	రూ. 73.80

కనకపట్నాన్ని

కమ్మేస్తున్న మత్తు

● గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా కావలి ● ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

● విచ్చలవిడిగా వాడకం, విక్రయాలు ● పెడదారి పడుతున్న యువత

● కొరవడిన తల్లిదండ్రుల పర్యవేక్షణ ● పోలీసు నిఘా వైఫల్యం

గంజాయి, డ్రగ్స్‌కు కావలి అడ్డాగా మారిపోతోంది. గంజాయి, మత్తునిచ్చే మాత్రలను కళాశాలల విద్యార్థులు, యువతను ఆధారంగా చేసుకుని కొంతమంది అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన యువత తమ బంగారు బతుకులను నాశనం చేసుకుంటోంది. ఈ నెల 23న కావలిలో గంజాయి విక్రయించే, మత్తు మాత్రలను డ్రగ్స్‌కు వినియోగించే 8 మందిని పోలీసులు అరెస్ట్ చేయగా వారిలో ఏడుగురు యువకులు కావడం గమనార్హం. డ్రగ్స్ వ్యాపారం చేసేవారు, వాటిని వినియోగించే ప్రాంతాలు పోలీసులకు తెలిసినా, ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోరనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొంతమంది గంజాయి వ్యాపారులకు అధికార పార్టీ నేతల అండదండలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.


శ్మశాన ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న యువత

కావలి, ఫిబ్రవరి 26 : వైజాగ్, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి గంజాయిని, హైదరాబాద్ వంటి మహా నగరాల నుంచి మత్తు నిచ్చే మాత్రలను తక్కువ ధరకు తెచ్చి కావలిలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కావలి ఉదయగిరి రోడ్డులోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోనూ, అక్కడ ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను ఆసరా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు గంజాయిని కొనుగోలు చేసుకుని సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాలకు వెళ్లి తాగుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఒకరు అనారోగ్యంతో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లాడు. అతనికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ ఆ విద్యార్థి పరిస్థితిని చూసి మత్తు పదార్థాల వాడకం ఏమైనా చేస్తున్నారా? అని అడిగారు. దీంతో అతను గంజాయి తాగుతున్నామని చెప్పగా, అది ఎక్కడ దొరుకుతుందని అడిగారు. మా కళాశాల వద్దనే నిత్యం విక్రయిస్తుంటారని చెప్పాడు. దీన్ని బట్టి చూస్తే కావలిలో ఎంత విచ్చలవిడిగా గంజాయి దొరుకుతుందో అర్థమవుతోంది. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు సమీపంలోని దుకాణాలతోపాటు బీకే నగర్, వడ్డిపాలెం, ఇందిరానగర్, తుఫాన్‌నగర్, పాతూరు, వైకుంఠపురం తదితర ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే ప్రచారం సాగుతోంది.


ఈ నెల 23న పోలీసులకు పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు, మత్తు మాత్రలు, సిరంజీలు

● మత్తు మాత్రలు..

హైదరాబాద్ నుంచి మత్తు మాత్రలను కొందరు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. మరి కొందరు స్థానికంగా ఉండే మందుల దుకాణాలలో అలాంటి టాబ్లెట్స్ కొని డ్రగ్స్ కింద వాడుకుంటున్నారు. టాబ్లెట్స్ మింగితే మత్తు సక్రమంగా రాదని, వాటిని పొడి చేసి ఆ పొడిని డిస్టిల్ వాటర్ లో కలిపి, ఆ లిక్విడ్‌ను సిరెంజ్‌ల ద్వారా నరాలకు ఎక్కించుకుని మత్తును ఆస్వాదిస్తున్నారు. కొంతమంది యువకులకు అయితే సిరెంజ్‌ల వాడకం వలన చేతుల మచ్చలు పడి పాడై పోయాయి. మత్తుకు బానిసలైన వారు తల్లిదండ్రుల మాట కూడా వినక పోవటంతో వారు కూడా వదిలేసినట్లు తెలుస్తోంది.

కొరవడుతున్న నిఘా

పోలీసుల నిఘా లేకపోవటం, పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవవడడంతో యువత మత్తుకు బానిసలై పెడదారి పడుతున్నారు. డ్రగ్స్ విక్రయాలపైనా, వినియోగించే వారిపైనా పోలీసులు తగిన నిఘా పెట్టక పోవటంతో కావలిలో విచ్చలవిడి అయింది. అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏమి చేస్తున్నారనే పర్యవేక్షణ లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది.

● నియంత్రణ కోల్పోతున్న యువత

కావలి వెంగళరావునగర్‌లో ఇటీవల ఒక యువకుడు మత్తుకు బానిసై ఒక విద్యార్థినిని గొంతుపై బ్లేడుతో కోశాడు. వాడిని పట్టుకుని విచారించగా మత్తుకు బానిసై అలా ప్రవర్తించినట్లు చెప్పాడని తెలిసింది. అలాగే స్థానిక ఐదులాంతర్ల ప్రాంతంలో ఇటీవల కొందరు యువకులు మత్తుకు బానిసలై అర్ధరాత్రి నగ్నంగా తిరుగుతూ అలజడి సృష్టించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకుని తగిన బుద్ధి చెప్పారు. అలాగే అంబేద్కర్‌నగర్ ప్రాంతంలో కొందరు యువకులు మత్తుకు బానిసలై పలువురిపై విచక్షణా రహితంగా దాడులు చేసి గాయపరిచారు. మచ్చుకు ఇవికొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఫిర్యాదులు పునరావృతం కానివ్వొద్దు

● 'జగనన్నకు చెబుదాం'లో ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 26 : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇచ్చి వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఓ వృద్ధుడు వీల్ చైర్‌లో రాగా వికాస్ మర్మత్ ఆయన వద్దకు స్వయంగా వచ్చి అర్జీని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, డీఆర్వో లవన్న, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


చక్రాల కుర్చీలో వచ్చిన వృద్ధుడి వద్దకు వచ్చి అర్జీ స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్

● రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, బ్రోకర్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్ ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌కు వినతిపత్రం సమర్పించారు. వీరికి జీతభత్యాలతోపాటు, ప్రావిడెంటు ఫండ్, ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత, మూడు శాతం కమిషన్ చెల్లించే లా చూడాలని కోరారు. లోకాస్ మెగా వెంచర్ పేరుతో కొందరు దగా చేస్తున్నారని, త్వరలోనే వారిని అడ్డుకుంటామని చెప్పారు.

● ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతూ జనసేన నేత గునుకుల కిషోర్ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మినగల్లు ఇసుక రీచ్‌లలో అక్రమ ఇసుక రవాణా జరుగుతోందని ఆరోపించారు.

● ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద జిల్లాలో నిర్మిస్తున్న గృహాల్లో రూ.30 కోట్ల కుంభకోణం జరిగిందని, దానిపై విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ వినతిపత్రం ఇచ్చారు. ఈ నిర్మాణాల్లో స్టీల్ కుంభకోణంతోపాటు, సిమెంటు కూడా పక్కదోవ పట్టిందని ఆరోపించారు.

పింఛను మంజూరులో కొత్త నిబంధనలు రద్దు చేయాలి

అర్హులైన చేనేత కార్మికులను పింఛను మంజూరులో నూతన నిబంధనలు రద్దు చేయాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్, డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పముజుల హరి మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం చేనేత కార్మికులు పింఛను పొందాలంటే రెండేళ్లపాటు వస్త్రాల తయారీకి అవసరమైన నూలు కొనుగోలుకు జీఎస్టీ బిల్లులు చెల్లించి ఉండాలన్నా రు. ఈ నిబంధనలు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా నరసయ్య, మన్నెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు

అనధికార యాప్‌ల ఊబిలో పడొద్దు : ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 26: యువత అనధికార యాప్‌లు, వ్యాపారాల ఊబిలో పడి మోసపోవద్దని జిల్లా ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 104 మంది ఫిర్యాదుదారులు వారి బాధలు చెప్పుకుని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ ట్రేడింగ్, ప్రైవేట్ చిట్స్, బ్యాంక్ లోన్స్, సైబర్ మోసాలు వంటి నేరాలను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏపీఆర్‌పీబీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులు నిలిపివేయాలని వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 26: తమ పంచాయతీ పరిధిలోని పొలాలు, ప్రభుత్వ స్థలాల్లో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మైనింగ్ పనులు చేపడుతున్నారని సోమవారం తూర్పు రొంపిదొడ్ల గ్రామానికి చెందిన కొంత మంది ఎంపీడీవో వెంకటకృష్ణకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవోతో మాట్లాడారు. మైనింగ్ తవ్వకాలపై గతంలోనే స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. సర్వే నంబరు 230-1పీలోని 9.50 ఎకరాల మేతపోరంబోకు భూమిలో అభ్రకం గని ఉందన్న దురుద్దేశంతో మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గ్రామ పంచాయతీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా యంత్రాలు, ఇతర వాహనాలతో తవ్వకాలు సాగిస్తుండడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. పశువులకు ఎంతో అనుకూలంగా ఉండే ఈ ప్రాంతంలో తవ్వకాలు సాగిస్తే సమీప నివాసాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. గతంలోనూ ఉన్నతాధికారులు పనులు నిలిపివేసినా తిరిగి కొనసాగిస్తూ ప్రశ్నించిన వారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి మైనింగ్ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమయం ఆసన్నమైంది...

మాదిగలు ఏకతాటిపై నిలవాలి !

● 9నచలో అమరావతి

● మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

కావలిటౌన్, ఫిబ్రవరి 26: మాదిగలు ఏకతాటిపై నిలవాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమవారం స్థానిక ఎంజేఆర్ కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉమ్మడి నెల్లూరుజిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగల ప్రయోజనం కోసమే కాదని, దివ్యాంగుల కోసం కూడా పనిచేస్తున్నదన్నారు. వారికి పింఛన్ రూ.200 నుంచి రూ.3000 చేరిందంటే తమ పోరాట ఫలితమేనన్నారు. తెలంగాణలో రూ.6,000లకు పెంచాలని డిమాండ్ చేసి సాధించామన్నారు. మార్చి నుంచి అమలు చేయబోతున్నారన్నారు. ఏపీలో కూడా రూ.6,000 పెంచాలన్న డిమాండ్‌తో చలో అమరావతికి పిలుపు ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం చివరి అంకానికి చేరుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఏపార్టీకి అనుకూలంగా ఉండాలన్న అంశంపై ఎమ్మార్పీఎస్ తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణకు జగన్ ప్రభుత్వం దూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వాసు దేవరావు, జిల్లా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న డీకేడబ్ల్యూ కళాశాలలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 26 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీన కళాశాల జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై, శ్రీసిటీకి చెందిన 11 కంపెనీల ప్రతినిధులు ఎంపికలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి సంవత్సరం చదువుతున్న సీఈజేపీలో రిజిస్టర్ అయిన విద్యార్థిని, విద్యార్థులు తమ వివరాలతో కూడిన మూడు సెట్లు రెజ్యూమ్, ఇతర జెరాక్స్ ప్రతులతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9030665477కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 311 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 26 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ 1వ సెమిస్టర్ పరీక్షలలో 311 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు యూనివర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో 4356 మంది విద్యార్థులకు గాను 4045 మంది హాజరయ్యారు.

నెల్లూరులో రౌడీషీటర్ హల్‌చల్

● ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 26: ఓ రౌడీషీటర్ తన ఇద్దరు మిత్రులతో కలసి స్కూటీపై వస్తూ ముందు వెళుతున్న ఓ కానిస్టేబుల్ బైకును ఢీకొన్నాడు. అతనిని పట్టుకునేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి బైక్, సెల్‌ఫోన్ ఇతర వస్తువులను దోచుకొని పరారైన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల మేరకు.. ఓ రౌడీషీటర్ ఇద్దరు మిత్రులతో కలసి ఓ స్కూటీపై, మరో ఇద్దరు మిత్రులు మరో వాహనంపై మినీబైపాస్ మీదుగా నగరంలోకి వస్తున్నారు. స్కూటీపై అతివేగంగా వస్తున్న రౌడీషీటర్ అన్నమయ్య సర్కిల్ సమీపంలో మఫ్టీలో బైక్‌పై వెళుతున్న నార్త్ ట్రాఫిక్ పోలీసు కానిస్టేబుల్ అనిల్‌ను ఢీకొట్టారు. దీంతో కానిస్టేబుల్ వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా నిందితులు పారిపోయే ప్రయత్నం చేశారు. కానిస్టేబుల్ సైరెన్ వేసుకుంటూ వారిని వెంబడించడంతో గమనించిన సత్యనారాయణపురానికి చెందిన సురేష్ అనే యువకుడు సైతం నిందితులను పట్టుకునేందుకు వెంబడించారు. వారు మిలీనియం సబ్‌స్టేషన్ సమీపంలో యూటర్న్ తీసుకుని రామలింగాపురం వైపు వెళ్లారు. వారిని పట్టుకునే క్రమంలో కానిస్టేబుల్ బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. సురేష్ మాత్రం వారిని వదలకుండా వెంబడించారు. శ్రీహరినగర్ వద్ద నిందితులు కత్తితో అతనిపై దాడిచేసి పరారయ్యారు. గాయపడిన సురేష్ వారిని వదలకుండా వెంబడించారు. రైల్వే గేటు వద్ద స్కూటీ ఆగిపోవడంతో నిందితులు అక్కడే వదిలేశారు. అక్కడకు చేరుకున్న సురేష్‌పై మరోసారి దాడి చేసి అతని బైక్, సెల్‌ఫోన్ తదితర వస్తువులను లాక్కొని పరారయ్యారు. గాయపడిన సురేష్ జయభారత్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న బాలాజీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. దాడికి పాల్పడింది రౌడీషీటర్ అబ్దుల్ అజీజ్‌గా గుర్తించినట్లు సమాచారం.

ఎట్టకేలకు ఘాట్ నిర్మాణం



సంగం, ఫిబ్రవరి 26 : సంగం బ్యారేజీ వద్ద ఎట్టకేలకు ఒక ఘాట్ నిర్మాణం చేపట్టారు. సంగం పెన్నా ఆనకట్ట స్థానంలో సుమారు రూ. 350 కోట్లతో బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తి కాకుండానే 2022 సెప్టెంబరులో బ్యారేజీని ప్రారంభించిన విషయం విదితమే. అయితే బ్యారేజీ నిర్మాణంలో భాగంగా మూడు ఘాట్‌లు నిర్మించాల్సి ఉంది. అందులో భాగంగా బ్యారేజీకి ఎడమవైపు దిగువున నిర్మాణం చేపట్టారు. పాత ఆనకట్ట వద్ద ఒకటి, శివాలయం వెనుక వైపు మరో ఒక ఘాట్ నిర్మించాల్సి ఉంది. బ్యారేజీ నిర్వాహణ గడువు (మెయింటెన్స్) వచ్చే సెప్టెంబరుతో ముగియనుంది. ఈలోపు మరో రెండు ఘాట్‌లతోపాటు, అసంపూర్తిగా ఉన్న పనులను కూడా పూర్తి చేయాల్సి ఉంది.

టీడీపీ నాయకులను కలిసిన కాకర్ల సురేష్



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో సురేష్

వింజమూరు, ఫిబ్రవరి 26: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ సోమవారం నెల్లూరులోని టీడీపీ నాయకులైన పుణ్యబైన చంచలబాబు యాదవ్, ఖమ్మం విజయరామిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, పార్టీ జిల్లా అధ్యక్షులను మర్యా దపూర్వకంగా కలిశారు శాలువా, పూలబొకేలతో సన్మానించారు. నియోజకవర్గంలో టీడీపీని గెలిపించి నారా చంద్రబాబునాయుడు, లోకేష్ నమ్మకాన్ని నిలబెడతానని ఆయన ఈ సందర్భంగా వారికి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాకర్ల వెంకట్, మధురెడ్డి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కాకర్ల అభ్యర్థిత్వంపై ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్: నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాకర్ల సురేష్‌ను పార్టీ అధిష్టానం ప్రకటించడంతో గండిపాళెం గ్రామ జలాశయం వద్ద వెలసిన సిద్దేశ్వరాలయంలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. కాకర్లకు టిక్కెట్ వస్తే స్వామికి ప్రత్యేక పూజలు చేపడతామని అందులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న ఎన్నికల్లో కాకర్ల అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో గండిపాళెం, యర్రంరెడ్డిపల్లి, ఇస్కపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు సందిరెడ్డి మాలకొండయ్య, అడుసుమ ల్లి వెం కటసుబ్బయ్య, వెంక టేశ్వర్లు, నల్లబోతుల రమణయ్య, నాదిండ్ల రంగనా యకులు, రాయవరపు మాలకొండ రావు, యర్రగుంట్ల చెన్నకృష్ణయ్య, కనకాద్రి, నాదిండ్ల రంగారావు, యాదాల మోహన్‌రావు, వడ్డె బాలకేశవులు పాల్గొన్నారు.



సిద్దేశ్వరాలయంలో టెంకాయలు కొడుతున్న నాయకులు

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి



ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 26: వ్యవసాయరంగానికి ఎలాంటి అంతరాయాలు లేకుండా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం నాయకుడు వెంకటయ్య సోమవారం ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా వ్యవసాయరంగానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా మాత్రమే ఇస్తుండడం, అందులోనూ అంతరాయాలు అధికంగా ఉండడంతో పంటలు ఎండు దశకు చేరుతున్నాయని పేర్కొన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకొనే వైసీపీ ప్రభుత్వం ఇలా ఇబ్బందులను పెట్టడం సరికాదన్నరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయరంగానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, లేదంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుమలాపురం సర్పంచ్ కృష్ణ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను సరి చూసుకుంటున్న అధికారులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 26: వచ్చేనెల 1 నుంచి 18వరకుజరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనంలో స్టేషన్‌కు చేరుకొన్న సెట్-2 ప్రశ్నపత్రాల బండిల్స్‌ను చీఫ్, డిపార్టుమెంట్ అధికారులు ఏ.రమణ, పీ.కమలహాసన్‌లు సరి చూసుకొని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయగిరి ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 355 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులేకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 26: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్-2024 కార్యక్రమం నిర్వహించారు. లాయల్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహులు పోటీలను ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజేతలైన విన్నర్, రన్నర్స్‌కు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, విజయమ్మ, పీడీ రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: పమిడిపాడులో మురుగు కాలువలు, జలజీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికి పైప్ లైను నిర్మాణం, సీసీ రోడ్ల విస్తరణ పనులను సోమవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన పమిడిపాడు, నబీనగరం, మురగ్గల్లో విజయాభవయాత్ర నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆదిశేషయ్య, జితేంద్రనాగ్‌రెడ్డి, పాల్గొన్నారు.

వరికుంటపాడు: మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వరికుంటపాడు, జంగంరెడ్డిపల్లిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహమ్మద్, పీఏసీఎస్ ఛైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, జేసీఎస్ కన్వీనర్ బొడ్డు వెంటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపైనే మూగజీవాల తిష్ఠ

- ఆవులను వీధుల్లోకి తోలుతున్న యజమానులు
- పశువుల సంచారంతో ప్రజల అవస్థలు

ఉదయగిరి, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై పశువుల తిష్ఠ వేస్తుండటంతో వాహనదారులు, పాదాచారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వీటివల్ల తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. పశువుల సంచారం కారణంగా ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ నియం త్రించేందుకు పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతు న్నారు. పశువుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడితే యజమానులపై చర్యలు తీసుకొం టామని చెబుతున్నా ఇప్పటివరకు ఎవరిపై చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.



బస్టాండ్ సెంటర్‌లో రాత్రివేళ రోడ్లపై పశువులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు..

పశువుల సంచారంపై స్థానికులు అనేకసార్లు పంచాయతీ, మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం కనిపించడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. పాత బస్టాండ్, ఎంపీడీవో కార్యాలయం, మార్కెట్, ప్రభుత్వ పాఠశాల, గ్రంథాలయం, వైద్యశాల, పోలీస్‌స్టేషన్, తహసీల్దారు కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఆవులు, గేదెలు ప్రధాన రహదారిపై తిరుగుతూ పరిగెత్తడం, పండుకోవడం వంటి పనులు చేయడం వల్ల వీటితో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. ఆవుల దాడి వల్ల అనేక మంది వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం...

ఆవుల సంచారంతో పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టాలని కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట.. రహదారులపై పశువుల సంచారం

వేద దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ

వింజమూరు, ఫిబ్రవరి 26: పట్టణ శివాలయంలో శనివారం భక్తులు వేద దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్మాణ దాత సీహెచ్ కోటేశ్వర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.మల్లికార్జున్‌రెడ్డి, ఆలయ పూజారి పనిస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఎంపీడీవోకు అభినందనలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 26: ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన తోటా వెంకటకృష్ణకుమారికి సోమవారం పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అభినం దనలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, కార్యద ర్శుల సంఘం అధ్యక్షుడు ప్రభుదాను, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఎంపీడీవోకి అభినందనలు తెలుపుతున్న కార్యదర్శులు

డప్పు కళాకారుల ఆందోళన

అనంతసాగరం, ఫిబ్రవరి 26: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం డప్పు కళాకారులు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయంకు చేరుకొని సమస్యలు వివరించారు. తమకు నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని, దరఖాస్తు చేసుకొన్న అర్హులందరికీ త్వరగా మంజూరు జాబితాలో పేర్లు ఎక్కించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో తాజ్‌మన్రూర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాషా, కళాకారుల జిల్లా కార్యదర్శి సీనయ్య తదితరులు పాల్గొన్నారు.



డప్పు వాయిస్తూ నిరసన తెలియచేస్తున్న కళాకారులు

బస్టాండ్లలో తాగునీటి వసతి లేక అవస్థలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 26: పట్టణంలోని ఆర్టీసీ, మున్సిపల్ బస్టాండ్లలో ప్రయాణికులకు తాగునీటి వసతి లేక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అవసరమైన సదుపాయాలన్ని కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా వాటి ఆచరణలో అమలులోకి తీసుకరావడం లేదు. దాహం వేస్తే ప్రయాణికులు కూల్ డ్రింక్స్‌షా పులు, హోటల్ దుకాణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న తాగునీటి కుళా యిలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వాటి ద్వారా నీరు వచ్చినా అవి వెచ్చగా ఉండడం, సకాలంలో వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్నారో, లేదో అన్న అనుమానాలతో ప్రయాణికులు నీటిని తాగలేకపోతున్నారు. కొందరు ఆ నీటితో ముఖం, చేతులు శుభ్రం చేసుకుని సేదతీరుతున్నారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో నీరు రాని కుళాయిలు



శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంక్

రైల్వే అండర్‌పాస్ ప్రారంభం

కావలి, ఫిబ్రవరి26: స్థానిక ముసునూరు టోల్‌ప్లాజా సమీపంలో తాళ్లపాలెం వరవ కాలువ వద్ద రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా రైల్వే శాఖ నిర్మించిన అండర్ పాస్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. టీఆర్‌డీ ఏఈ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాని ప్రసంగాన్ని వీడియో స్క్రీన్ ద్వారా ప్రదర్శించగా దాన్ని తిలకించిన అనంతరం వర్చువల్‌గా అండర్‌పాస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకుని 20 రోజుల కిందట ఆర్ఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం స్కూల్, గౌరవరం జడ్పీ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో టీఆర్‌డీ ఏఈ టీ. సురేష్, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేతలు జీ. భరత్‌కుమార్, కే. బ్రహ్మానందం, సీవీసీ సత్యం, వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారాయణ పాల్గొన్నారు.

- **ఉలవపాడులో..**

ఉలవపాడు : మండలంలోని సుబ్బరాయుడిసత్రం గ్రామానికి అనుసంధానంగా నిర్మించిన అండర్‌పాస్‌ను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వే ఉన్నతాధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉలవపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు షేక్ హుస్సేన్, ఆర్ నాగరాజు, అశోక్, శివ నాగేశ్వరావు, ఆంజనేయులు, సర్పంచు మానికల నాగలక్ష్మి, నియోజకవర్గ బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



కావలి : ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన రైల్వే అండర్‌పాస్

వీరబ్రహ్మాం ఆలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బిట్రగుంట, ఫిబ్రవరి 26: బోగోలులోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఉదయం మృత్యుంజయ, ఆయుష్షుహోమం, శిఖర కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి, బలిహరణ, గోదర్శనం, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభ దాతలు అమరా బచ్చు ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్ సంధ్య దంపతులతో యంత్రాలకు అభిషేకాలు చేయించారు. అనంతరం పీ బాలకేశవులు-అనుపమ దంపతులు ఉభయకర్తలుగా వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల శాంతికల్యాణం జరిగింది. సీహెచ్ వేంకటేశ్వర్లు-శోభారాణి దంపతులు అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, ఎంపీపీ అంకులయ్య, సులోచనమ్మ, బాబుజీ, మఠం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

- **సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ**

బోగోలు మండలం వెంకటేశ్వరపాలెంలో సోమవారం సీతా సమేతకోదండరామ, లక్ష్మణాంజనేయుల విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వార్డు సభ్యులు రాజు, నాగార్జునరెడ్డి, గ్రామస్థులు కావలి టీడీపీ అభ్యర్థి కావ్యకృష్ణారెడ్డిని ఆహ్వానించారు. హోమ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కావలి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి, స్థానిక వైసీపీ నేతలు కూడా ప్రతిష్ఠలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు వెంగమాబ-వేణుగోపాల్‌రెడ్డి దంపతులు, స్థానిక వైసీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న దాతలు, భక్తులు

పార్టీ గుర్తుతోనే కావలి నుంచి పోటీ !

అల్లూరు, ఫిబ్రవరి 26 : రానున్న ఎన్నికల్లో కావలి నుంచి తాను పోటీ చేస్తానని, అది కూడా పార్టీ గుర్తుతోనేనని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అది ఏ పార్టీనో కూడా త్వరలో తేల్చి చెప్తానని అన్నారు. అల్లూరులోని ఆయన నివాసంలో సోమవారం అభిమానులు, కార్యకర్తలతో కలసి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా విష్ణు నడిచే దారిలోనే తామంతా నడుస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితమంతా ప్రజాసేవతోనే గడిపానని, రానున్న రోజుల్లో కూడా ప్రజలతోనే కలసి ఉంటానన్నారు. టీడీపీకి రాజీనామాతోపాటు తన అభిప్రాయంపై ఒక నిర్ణయం తీసుకొని ఈ సమావేశం ద్వారా ప్రకటించాల్సి ఉన్నా వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. త్వరలోనే నిర్ణయాన్ని వెల్లడిస్తానని అన్నారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, బిజ్జం వేణుగోపాల్ రెడ్డి, గోసల గోపాల్‌రెడ్డి, పాలవెల్లి పద్మనాభరెడ్డి, పూనూరు మురళి, సుబ్బయ్యలతోపాటు బుచ్చి, కొడవలూరు, కోవూరు, విడవలూరు మండలాల నుంచి తరలివచ్చిన అనుచరులు కూడా పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, ఫిబ్రవరి 26 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి వీఆర్ కోటలోని మన్నేరులో ఇసుక నింపుకొని గ్రామంలోని రైస్‌మిల్లు వద్దకు రాగానే పట్టుకొని ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

సామాజిక న్యాయానికి వైసీపీ తూట్లు

కందుకూరు : అసెంబ్లీ అభ్యర్థులను నిర్ణయించే విషయంలో వైసీపీ సామాజిక న్యాయానికి తూట్లు పొడిచిందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. టీడీపీ తొలివిడతగా ప్రకటించిన 94 మంది అభ్యర్థుల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించారని పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రజాప్రతినిధుల ఎంపికలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ, పార్టీ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా వాస్తవాలను అర్థం చేసుకుని వైసీపీకి తగినబుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

టీడీపీ నేతల సమావేశం

జలదంకి: స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం మండలంలోని పలుగ్రామాలకు చెందిన నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాకర్ల సురేష్‌ను ఉదయగిరి అభ్యర్థిగా అధిష్ఠానం ఎంపిక చేయడంపై ఆసక్తికర చర్చ జరిగింది. మాజీ ఎమ్మెల్యే బొల్లినేనితో త్వరలో సమావేశం కావాలని నాయకులు తీర్మానించారు. సమావేశంలో నాయకులు మధురెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాల్యాద్రి యాదవ్, వినోద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా కాకర్ల సురేష్ మధురెడ్డిని కలుసుకునేందుకు వెళ్లగా ఆయన ఇంటి వద్ద లేకపోవడంతో అక్కడ నుంచి అన్నవరం వెళ్లి భాస్కర్‌రెడ్డిని కలుసుకుని పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

జలదంకి : మార్చి3న జరిగే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లకు శిక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మీ, కమ్యూనిటీ ఆరోగ్యాధికారి సోమేశ్వరరావు, హెల్త్‌ఎడ్యుకేటర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కావలి : నెల్లూరు జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక బుధవారం స్థానిక ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దె వెంకటేశ్వర్లు, కార్యదర్శి వాయిల శ్రీనివాసులు సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు బరువు 85 కేజీల లోపు ఉండాలన్నారు. వారు 28వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు 94405 03548, 92989 50860 నంబర్లను సంప్రదించాలన్నారు.

స్థలం ఆక్రమణకు యత్నించడం దారుణం

కందుకూరు : ప్రజానాయకుడు దామా చెంచయ్య కుమార్తె జోయాకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని మున్సిపాలిటీ ఆక్రమించటానికి ప్రయత్నించటం దారుణమని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టరు కొల్లా రాజమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ అమలులో ఉన్నా ఆ స్థలాన్ని తమ స్వాధీనంలోకి తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలి : విష్ణు

అల్లూరు, ఫిబ్రవరి 26 : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో మెలగాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. అల్లూరు మండలం ఇందుపూరు కాలువ సమీపంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో దేవిరెడ్డి శారద 7వ వర్థంతిని పురస్కకరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత విష్ణు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవిరెడ్డి శారదమ్మ జ్ఞాపకార్థంగా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సుధాకర్‌రెడ్డి ఉచిత విద్య, వైద్యంతోపాటు సామాన్యులకు అందుబాటులో కల్యాణ మండపం ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చి వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారన్నారు. శిబిరంలో 90 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, టీడీపీ నేత బీద గిరిధర్, అడ్మిన్ మేనేజరు అనిల్ కుమార్, వైద్యులు జెట్టి రమేష్, ప్రిన్సిపాల్ శ్రీలతాచౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రారావు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి

గ్రావెల్ అక్రమంగా తవ్వుకునే ఎమ్మెల్యే దొరకడం దురదృష్టకరం

అల్లూరు, ఫిబ్రవరి 26 : విమానాశ్రయానికి సేకరించిన భూముల్లో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుకునే ఎమ్మెల్యే దొరకడం కావలి నియోజకవర్గ ప్రజల దురదృష్టకరమని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అధ్యక్షతన సోమవారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం రైతుల నుంచి భూములు కొనుగోలు చేస్తే ఈ ఎమ్మెల్యే గ్రావెల్ తవ్వుకొని సొమ్ము చేసుకోవడం దౌర్భాగ్యమన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, రామాయపట్నం పోర్టులకు కూడా గత టీడీపీ హయాంలోనే శంకుస్థాపన చేసి నిధులను కేటాయించడం జరిగిందన్నారు.అయితే నేటి ప్రభుత్వంలో అవి తమ ఫలితం అని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. అల్లూరు మండల పరిసర ప్రాంతాల రైతాంగం సాగునీటిని తెచ్చుకునేందుకు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వాటిల్లిందన్నారు. తాను సంపాదించుకునేందుకు రాలేదని, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానని కావ్య అన్నారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, అరగల రమణయ్య, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

వైసీపీ నేతలు ఇంటికొస్తే కడిగిపారేయాలి : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 26: వైసీపీ నాయకులు మీ ఇంటికొస్తే హామీల అమలు విషయమై కడిగిపారేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 32వ వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, ఉన్నం వీరాస్వామి, డబ్బుగొట్టు మల్లికార్జున, దామా వెంకటేశ్వర్లు, మెట్ల అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఇంటూరి నాగేశ్వరరావు

విద్యుత్ వేళల మార్పుతో పంటలు నష్టపోతాం..

ఉలవపాడు, ఫిబ్రవరి 26 : విద్యుత్ వేళల మార్పుతో ఆకుకూర పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని కరేడు గ్రామ రైతులు సోమవారం మండల విద్యుత్ ఏఈ పీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేశారు. తీరప్రాంతమైన కరేడులో వేరుశనగతోపాటుగా సుమారు 100 ఎకరాల్లో ఆకుకూరలు కూడా పండిస్తున్నామన్నారు. ఉదయం 5గంటలకు విద్యుత్ సరఫరాతో ఆకుకూర పంటకు నీళ్లు పెట్టుకుంటామన్నారు. అయితే 15 రోజుల నుంచి ఉదయం 8 గంటలకు విద్యుత్ సరఫరా చేస్తుండటంతో ఎండ సమయంలో నీళ్లు పెట్టినా ఫలితం ఉండదన్నారు. ఎస్ఈతో మాట్లాడి ఎప్పటిలాగే ఉదయం 5గంటలకు కరెంటు సరఫరా వచ్చేలా చూస్తానని ఏఈ చెప్పారు.

'విశ్వకర్మ'కు బడుగులు పనికిరారా ?

కావలి,ఫిబ్రవరి26: విశ్వకర్మ పథకం కింద రుణాలు పొందటానికి బీజేపీ కార్యకర్తలే అర్హులా... బడుగు, బలహీన వర్గాలవారు పనికి రారా..? అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి ప్రశ్నించారు. సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి, ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో చేతివృత్తులవారికి, చిన్న వ్యాపారులకు రూ.లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు రుణసౌకర్యం కల్పిస్తున్నదని అన్నారు. ఈ పథకంలో దళిత, గిరిజనులకు అవకాశం ఇవ్వకుండా బీజేపీ కార్యకర్తలే దరఖాస్తులు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులకు పథకం వర్తించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జే విజయరత్నం, చౌటూరు లక్ష్మయ్య, కత్తి వెంకటరత్నం, ఎస్‌కే హుస్సేన్, ఖాదర్ బాషా, సుబ్రహ్మణ్యం, విడవలూరు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలి

కావలి : పట్టణ జనాభా పెరుగుతున్నందున, కొన్ని గ్రామాలను మున్సిపాలిటీలో కలిపినందున పారిశుధ్య కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని సీఐటీయూ నాయకులు పసుపులేటి పెంచలయ్య కోరారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి సోమవారం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. మున్సిపాలిటీలో ముసునూరు, మద్దూరుపాడు,బుడంగుంట తదితర గ్రామాలను కలిపినా కొత్తగా పారిశుధ్య కార్మికులను పెంచలేదన్నారు. చనిపోయిన, పదవీ విరమణ చెందిన వారి స్థానంలో కొత్త వారి నియామకాలు చేపట్టలేదన్నారు.పట్టణ అవసరాలకు తగినట్లుగా కార్మికులను నియమించాలన్నారు. లేకుంటే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వై. క్రిష్ణ మోహన్, టీ శీనయ్య, ఎం. పోలయ్య, క్రాంతికుమార్, వో రమేష్, కే. బాబు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని అంతం చేయాలి : కురుగొండ్ల



కోవూరులో దినేష్‌రెడ్డి



సైదాపురంలో కురుగొండ్ల

సైదాపురం : రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేసి సైకో సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి సైదాపురం పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లి, మొలకలపూండ్ల గ్రామాలలో బాబుషూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. మొలకల పూండ్ల గ్రామంలో నాయకుడు అడుమల్లి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికి మహిళలు హారతులు పట్టారు. కార్యక్రమంలో పరిశీలకులు జెన్ని రమణయ్య, నాయకులు తెమ్మసాని దిలీప్‌చౌదరి, కొండూరు సుబ్రమణ్యంరాజు, కీర్తిపాటి రాజశేఖర్‌రాజు, పావులూరు పార్థసారధినాయుడు, పాల్గొన్నారు.

● **మైనారిటీల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం**

కోవూరు : మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కృషి సాగిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సత్రం వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమంలో ఆయన మాట్లాడు తూ మైనార్టీల సంక్షేమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాల్ని అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, ధారా విజయబాబు, సూరిశెట్టి శ్రీనివాసులు, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సత్రంవీధి మసీదు కూడలికి చెందిన మైనార్టీ యువకులు పెద్దసంఖ్యలో సాదిక్, కరియప్ప నాయకత్వంలో టీడీపీలో చేరారు. వారికి దినేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 26 : విద్యార్థి దశ నుంచే వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని మినిస్టరీ ఆఫ్ కరెంటు అఫైర్స్ డిప్యూటీ సెక్రటరీ బుడిగి శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం కృష్ణపట్నం పోర్టులోని అదాని వరల్డ్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను నేర్చుకోవాలని, సమస్యలను ధైర్యంతో ఎదుర్కోవాలన్నారు. వికాసానికి, విజయానికి అవసరమైన విషయాలలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఈ కార్యక్రమంలో అదాని స్కూల్ ప్రిన్సిపాల్ సిరియాల సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ తిరుపతయ్య, ఎంఈవోలు మధుసూదన హేమసుందర్, ఎంపీడీవో లక్ష్మణ కుమార్, పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

పొదలకూరు, ఫిబ్రవరి 26: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం 96 మందికి 124 ఎకరాల అసైన్‌మెంట్ పట్టాలు, 137మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు లాభపడే విధంగాకొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు తహసీల్దారు వీర వసంతకుమార్, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, జడ్పీటీసీ నిర్మలమ్మ, మాజీ ఎంపీటీసీ భారతమ్మ, వైస్ ఎంపీపీ వేణుంబాకం చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

జాతీయ చేతివృత్తుల ఐక్యత పార్టీని ఆదరించండి

పొదలకూరు, ఫిబ్రవరి 26: రాష్ట్రంలోని చేతివృత్తుల వారందరూ రాజకీయంగా ఎదగాలంటే జాతీయ చేతివృత్తుల ఐక్యత పార్టీని ఆదరించాలని ఆ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతగింజల సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఆయన తన పార్టీ సభ్యులతో కలిసి స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో తమ పార్టీ కమిటీలు వేశామని, ఈ కమిటీల్లో చేరాలనుకునేవారు తన 9493452924 నెంబరుకు ఫోన్ చేసి పార్టీలో చేరవచ్చునన్నారు. పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గ్యాస్ సిలిండర్ గుర్తు కేటాయించిందని, ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్ చక్రవర్తి, బొమ్మన సుబ్రహ్మణ్యం, అవ్వారి శీనయ్య, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 26 : మండలంలోని ఇస్కపాలెంలో సోమవారం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇంగిలాల వెంకటచైతన్యకుమార్ మాట్లాడుతూ దోమల వల్ల డెంగ్యూ, టైఫాయిడ్ తదితర జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

స్టిక్కర్ల జగన్‌ను సాగనంపండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి స్టిక్కర్ పులి జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని బీజేపీ రాష్ట్ర మోర్చాల ఇన్చార్జి పి.సురేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని తడికలబజార్ వద్ద సోమవారం ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల పక్షపాతి ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే.ఆదినారాయణ, పి.శ్రీనివాసులు, సుబ్బారావు, భైరి శ్రీనివాసులు, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు యువత చేరిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 26: నగరంలోని కుక్కలగుంట రాజేంద్రనగర్‌లో పలువురు యువత సోమవారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి యువకులకు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పాలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జ్ పి.సురేంద్రరెడ్డి, నాయకులు మిడతల రమేష్, యశ్వంత్‌సింగ్, జగదీష్‌సింగ్, కీపుడి బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ



కుళాయిలను పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 26: జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి వచ్చే భక్తుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక, మండల బీజేపీ నాయకులతో కలిసి జొన్నవాడ ఆలయ పరిసరాలు, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు, స్నానపు గదుల దుస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఇస్తున్న, ఇచ్చిన భారీ విరాళాలు, వ్యవసాయ భూములున్నా ఆలయ పరిస్థితి దయనీయంగా ఉండడం విచారకరమన్నారు. ఆలయంలో అన్యమతస్థులు మత మార్పిడికి ప్రచారం చేస్తున్నారంటూ ఖండించారు. ఇప్పటికైనా ఈఓ గిరికృష్ణ స్పందించి భక్తుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆలయ సిబ్బంది మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు గండి రఘురామయ్య, పెంచలప్రసాద్, శ్రీనివాసులు, నారాయణ, రోసిరెడ్డి, పెంచలయ్య తదితరులున్నారు.

సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు బోర్డులు కడితే తొలగిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 26: బుచ్చి నగర పంచాయతీలోని బాంబే హైవే మీద రోడ్డు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు వ్యాపార ప్రకటనలు, ఫ్లెక్సీలు, బోర్డులు లాంటివి ఏర్పాటుచేస్తే తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు తెలిపారు. వ్యాపార ప్రకటనలు, ఫ్లెక్సీలు తదితరాలు కట్టడంవల్ల నగర పంచాయతీ ఆస్తికి నష్టం వాటిల్లుతోందన్నారు.

తూతూ మంత్రంగా బుచ్చి మండల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 26: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ, శ్రీనివాసులు అధ్యక్షతన ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశంలో పెనుబల్లి సర్పంచు వూడా పెంచలయ్య మాట్లాడుతూ బుచ్చి - జొన్నవాడ మార్గంలో పెనుబల్లి పరిధిలోని రోడ్డు దుస్థితి గురించి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని, పెనుబల్లిలో చేతి పంపుల మరమ్మతులు చేయడంలేదని తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ రాజ్యలక్ష్మి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామన్నారు. మినగల్లు సర్పంచు బొర్రు పూజిత మాట్లాడుతూ రైతులు ధాన్యం ఆరబోసి నిల్వచేసుకునేందుకు మంజూరైన గోడౌన్ నిర్మాణం చేపట్టకపోవడంపై ప్రశ్నించగా మార్కెటింగ్ శాఖ పరిధిలోనిదని వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. ఈ సమావేశానికి రేబాల సర్పంచు భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు హాజరయ్యారు.

వైభవంగా స్వర్ణకవచం అలంకరణ

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 26: పప్పులవీధిలోని సిద్ధివిఘ్నేశ్వర స్వామికి సోమవారం రాత్రి స్వర్ణ కవచం అలంకారం వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు విరాళంతో తయారు చేసిన ఆ స్వర్ణ కవచం భక్తుల దర్శనార్థం పాండురంగ అన్నదాన సమాజం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర స్టోన్‌హౌస్‌పేట వీధుల్లో కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మాచవోలు కోటేశ్వరరమ్మ ఆధ్వర్యంలో స్వర్ణ కవచ అలంకారం పూజలు జరిగాయి. అనంతరం సిద్ధి బుద్ధి సమేత సిద్ధివిఘ్నేశ్వరస్వామికి కల్యాణోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాల్లో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పాండురంగ అన్నదాన సమాజం ఉపాధ్యక్షుడు పాదర్తి బాలాజీ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బయ్యా ప్రసాద్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఏకాంతసేవ

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 26 : నగరంలోని ఉడయవర్లు దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత ఆదికేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామివారికి అమ్మవార్లకు ముసుగుల సేవ వేడుకలను అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం చక్రస్నానం, పవిత్రజలం భక్తులపై సంప్రోక్షణ జరిగింది. వేదమంత్రాలు మంగళవాయిద్యాల మధ్య సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. అనంతరం రాత్రి ద్వాదశరాధన, ఏకాంతసేవ జరిగాయి.

విద్యాప్రాప్తి కోసం హయగ్రీవ ఇష్టహోమం

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 26: చదువుల్లో రాణించి మంచి ఉద్యోగాలు పొందాలన్న సంకల్పంతో అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకులు సోమవారం హయగ్రీవ ఇష్టహోమం నిర్వహించారు. వీఆర్ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న 22వ అష్టలక్ష్మీ యాగం సోమవారం 8వ రోజుకి చేరింది. ఉదయం పెరుమాళ్ ఆరాధన, అభిషేకం, అర్చన, బాలభోగనివేదన, మంగళశాసనంలు జరిగాయి. అనంతరం విద్యా ప్రదాత శ్రీహయగ్రీవ స్వామి ఇష్టహోమం జరిగింది. సాయంత్రం కోటి విష్ణు సహస్ర నామ పారాయణం, మహాపూర్ణాహుతిలు జరిగాయి.



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 26 : టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ మంజూరు చేసిన నిధులతో ఇరుకళల పరమేశ్వరి ఆలయం అభివృద్ధి పనులకు సోమవారం రాత్రి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ప్రాకార మహా మండపం, ఆలయం చుట్టూ ఫ్లోరింగ్, దేవస్థాన ప్రధాన ముఖద్వారం పునఃనిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆర్.శ్రీనివాసురావు, ధర్మకర్తలు, ఈవో మల్లికార్జునరెడ్డి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, అధికారులు, వైసీపీ నాయకులు, పాల్గొన్నారు.

నానో ఎరువులపై రైతులకు అవగాహన

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 26 : మండలంలోని నరుకూరు గ్రామంలో సోమవారం ఆత్మవారి సౌజన్యంతో నానో ఎరువులు, యూరియా, డీఏపీలపై వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పైరుపై ఏ దశలో ఏ పురుగుమందులు వాడాలో రైతులకు తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి శిరీష మాట్లాడుతూ ఈ క్రాప్ గురించి తెలియజేసి, ప్రతి రైతు ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. రసాయన ఎరువులు మోతాదులో వాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శైలజకుమారి, శాస్త్రవేత్త డాక్టర్ లోకేష్‌బాబు, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ఠ



గుంజ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 26 : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 20 నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ఏర్పాటు పనులు ప్రారంభించేందుకు సోమవారం భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజగుంజను పసుపు కుంకుమలు, పూలతో అలంకరించారు. విష్వక్సేనారాధన, నవగ్రహ పూజ, పుణ్యాహవచనం, తదితర పూజలు నిర్వహించి గుంజ ప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9గంటలకు హుండీలలోని కానుకలను లెక్కిస్తామని, భక్తులు తరలిరావాలని కోరారు.

నెల్లూరు రూరల్ సీఐగా మారుతీకృష్ణ

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 26 : నెల్లూరు రూరల్ సీఐగా కే మారుతీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విధించిన నిబంధనల మేరకు ప్రస్తుత సీఐ సుబ్బారావును వీఆర్‌కు బదిలీ చేసిన పోలీసు శాఖ వీఆర్‌లో ఉన్న మారుతీకృష్ణను రూరల్ మండల సీఐగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి, శాంతిభద్రతలు కాపాడేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు.

నారాయణతో వీపీఆర్ భేటీ



నారాయణతో భేటీ అయిన వీపీఆర్, పక్కన అజీజ్, రూప్

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. నెల్లూరులోని నారా యణ నివాసానికి వీపీఆర్ వెళ్లగా ఆయన వెంట డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ఉన్నారు. వీపీఆర్‌కు నారాయణ, అబ్దుల్ అజీజ్‌లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ సోమవారం నెల్లూరులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, కంభం విజయరామిరెడ్డి, పీ చెంచలబాబుయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పరిశ్రమలు లేవు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు!

నెల్లూరు(వైద్యం) : రాష్ట్రంలో పరిశ్రమలు లేవు... నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు అంటూ మాజీమంత్రి, టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ దుయ్యబట్టారు. సోమవారం నగరంలోని 7వ డివిజన్‌లో టీడీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. అనంతరం బాబూష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం చేపట్టి ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. చివరి దశలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నారాయణను కలసిన అంకయ్య చౌదరి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 26 : తెలుగుదేశం పార్టీ పరిశోధన, సమాచార విభాగం సభ్యుడు, ప్రముఖ న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి సోమవారం మాజీ మంత్రి పొంగూరు నారాయణను ఆయన నివాసంలో కలిశారు. నారాయణకు టీడీపీ నెల్లూరు నగర టికెట్ ప్రకటించినందుకు అభినందనలు తెలిపారు. తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

గొల్లకందుకూరులో ఎంపీ ఆదాల పర్యటన

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 26 : మండలంలోని గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామాల్లో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. నగర మేయర్ స్రవంతితో కలిసి నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. పలువురుని వైసీపీలోకి ఆహ్వానించారు. ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ భయంతో పారిపోయారు : కోటంరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కొడతారన్న భయంతోనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సిటీ వదిలి నరసరావుపేటకు పారిపోయారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం 15వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని టీడీపీ నాయకులపై దాడులు చేయించడం, సామాన్యులను బెదిరించడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే తమ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలేది లేదని హెచ్చరించారు. నెల్లూరు సిటీ అభివృద్ధి ఒక్క నారాయణతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేపీ చౌదరి, ఆకుల హనుమంతరావు, శ్రీనివాసులు నాయుడు, జానకి, కమ్మ కల్యాణి, సురేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. సోమవారం పలు డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. 20వ డివిజన్‌కు చెందిన అరుగుంట దామోదర్‌రెడ్డి, వాకాటి ప్రసాద్‌రెడ్డి, చల్లగుంట్ల రాంబాబు, అలూరు సంపత్‌రెడ్డి, పసల సుబ్బయ్య, గుడ్డపాతల రవి, చెరుకూరు వినోద్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సజ్జాపురం గ్రామానికి చెందిన ఎరగల పెంచలయ్య, వారి అనుచరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. 22వ డివిజన్ సప్తగిరి కాలనీకి చెందిన కలపాటి జయంతిరెడ్డి, కట్టా సులోచన, సముద్రాల ప్రశాంతి, మరికొంత మంది మహిళలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కంటే సాయిబాబా, పముజుల ప్రదీప్, జలదంకి సుధాకర్, చేజర్ల మహేష్, దారా మల్లి, పోతు రాజు రవి తదితరులు పాల్గొన్నారు.

వీపీఆర్‌కు కలిసిన పలువురు ప్రముఖులు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 26: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సోమవారం పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, కార్లతో భారీ ర్యాలీగా వేమిరెడ్డి ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. లేగుంటపాడు, జమ్మిపాళెం, సీతారామపురం గ్రామాలకు చెందిన నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి శశిధర్‌రెడ్డి, దాసరి మురళి, దాసరి విజయభరత్, దేశపాండే తదితరులు వీపీఆర్‌ను కలిశారు.

నారాయణ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న లెక్కల వెంకారెడ్డి మిత్రబృందం

● వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న నారాయణ

● 3,4,5 డివిజన్లలో వైసీపీ నుంచి భారీగా వలసలు



నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నెల్లూరు తెలుగుదేశం పార్టీలో చేరికలు ఊపందుకున్నా యి. మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి (విబిఆర్)లు వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ వైసీపీ నాయకులను ఆకర్షిస్తున్నారు. నారాయణ నేతృత్వంలో 3,4,5 డివిజన్లకు చెందిన వైసీపీ కీలక నేతలు టీడీపీలో చేరారు. ఆది, సోమవారాల్లో ఈ డివిజన్లకు చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు లెక్కల వెంకారెడ్డి తన మిత్ర బృందంతో కలిసి నారాయణ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వెంకారెడ్డి టీడీపీలో చేరిక సందర్భంగా 3,4,5 డివిజన్లకు చెందిన ఆయన మిత్రబృందం, స్థానిక ప్రజలు భారీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొంగూరు నారాయణకు ఘనస్వాగతం పలికారు. వందలాది మంది యువకులు మోటార్ సైకిల్ ర్యాలీలతో నారాయణకు స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. వెంకారెడ్డితో పాటు వందలాది మంది ఆయన మిత్రులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

నెల్లూరును రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తయారు చేస్తా..!! : పొంగూరు నారాయణ

లెక్కల వెంకారెడ్డి మిత్ర బృందం పార్టీలో చేరుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని టీడీపీలో చేరడానికి ముందుకు వచ్చిన వెంకారెడ్డికి, ఆయన మిత్రులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తయారు చేస్తానన్నారు. గతంలో తను చేసిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోలేదని, ఈ రోజు ఎక్కడికెళ్లినా అప్పుడు నేను చేసిన అభివృద్ధి గురించే చెబుతుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంత కృతజ్ఞత చూపుతున్న నెల్లూరు నగర ప్రజలకు ఇంకా ఎంతో చేయాలని ఉందని, ప్రజల అభిమానంతో ఈ ఎన్నికల్లో గెలిచి, తప్పకుండా నెల్లూరు నగరాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ టౌన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. తాను తాటాకుల గుడిసెలో పెరిగానని, పేదల కష్టాలు తెలుసునని, అందుకే పేదలందరికి గూడు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పేదవారి ఆకలి తీర్చేలా అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామన్నారు. నిరుపేదల జీవనోపాధి పెంచేలా కుటీర పరిశ్రమలు స్థాపిస్తామన్నారు. ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని పూర్తిగా మరిచిపోయిన వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని నారాయణ ప్రజలను కోరారు. తెలుగుదేశం పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్లపాక అనురాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శేషరెడ్డి, మురళి, మస్తాన్, సర్దార్, మున్నా, ముని, స్టాలిన్ కుమార్, రవికుమార్‌రెడ్డి, హజరత్ రెడ్డి, ఫరూక్, శ్రీనివాసులురెడ్డి, రాణెమ్మ, మహీంద్ర, ఓబుల్‌రెడ్డి, షంషీర్, రసూల్, కిషోర్, టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



నారాయణ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వెంకారెడ్డి తదితరులు

ఎన్‌ఎంసీలో స్పందనకు 21 వినతులు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 26 : కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు నగరంలో నుంచి 21 మంది తమ వినతులను ఏడీసీ శర్మదకు అందజేశారు. రెవెన్యూ పరమైన ఇబ్బందులతో ఇద్దరు, ఇంజనీరింగ్ విభాగం నుంచి సాయం కోరుతూ ఆరుగురు, సిటీ ప్లానింగ్ ఇబ్బందులతో మరో నలుగురు, ఇళ్ల సమస్యలతో ఆరుగురు, శానిటరీ సమస్యలతో ఇద్దరు, ఇతర సమస్యలపై ఒక్కరు తమ వినతులను అందచేశారు. వీటన్నీటిని పరిశీలించి తగు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి

● మహిళా ఆరోగ్య కార్యకర్తలతో డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 26: మహిళా ఆరోగ్య కార్యకర్తలు సచివాలయాల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. సోమవారం సచివాలయాల మహిళా ఆరోగ్య కార్యకర్తల సంఘం నాయకులు డీఎంహెచ్‌వోని కలిశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉమా, రాధాలు నూతన కార్యవర్గాన్ని ఆయనకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రజని, అపర్ణ, శీనయ్య, నాగేశ్వరి, కవిత, కార్యనిర్వాహక కార్యదర్శి చాముండేశ్వరి, సంయుక్త కార్యదర్శులు జ్యోతి, సుభాషిణి, సరిత, ఉమాదేవి, భవాని, కోశాధికారి అమరావతి, ఏపీఎన్‌జీవో అధ్యక్షులు మన్నెపల్లి పెంచలయ్య, కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు కరుణమ్మ, నగర అధ్యక్షుడు రామకృష్ణరెడ్డి, సాయిరాం, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కన్నన్, వసుంధరకు సన్మానం

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 26 : నగరంలోని వసుజ్యోతి ట్రస్ట్ సమావేశ మందిరంలో సోమవారం పీహెచ్‌పీ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నటరాజన్ కన్నన్, వసుంధరను సన్మానించారు. నారాయణ డెంటల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నటరాజన్ కన్నన్ ఢిల్లీలో ఇటీవల బాలి మెమోరియల్ అవార్డు అందుకున్నందుకు, ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఇటీవల జరిగిన 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పరుగు పందెంలో 75 ఏళ్ల గ్రూప్‌లో వసుంధర ఒక బంగారు పతకం, మూడు కాస్యం పతకాలను సాధించినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు అనుముల జయప్రకాష్, డాక్టర్ అశోక్, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్‌బాషా, రూడ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ అసోసియే షన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రావు, రాఘవేంద్ర శేఖర్, నాయకులు గోరంట్ల శేషయ్య, జయకుమార్, రామ రాఘవయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 26 : నారాయణ వైద్య కళాశాలలో సోమవారం 19వ గ్రాడ్యుయేషన్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయన విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 2018 బ్యాచ్ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులై పట్టాలు పొందే కార్యక్రమం నిర్వహించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ రెజినాల్డ్, న్యూరాలజిస్ట్ డాక్టర్ సంపత్‌కుమార్, నారాయణ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వకుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, అకాడమీ డీన్ డాక్టర్ నరసింహరెడ్డి, డీన్ డాక్టర్ నువ్వుల శివకుమార్, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ ఆనంద్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 26 : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జిల్లా లీడ్ బ్యాంకు కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో వారోత్సవ పోస్టర్‌ను నగరంలోని ఓ భవనంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. పొదలకూరులోని జడ్పీ హైస్కూల్లో వ్యాసరచన పోటీలు, వేగూరు జడ్పీ హైస్కూల్లో క్విజ్ పోటీలు, డీకేడబ్ల్యూ కళాశాలలో క్రాస్‌వర్డ్ పజిల్ పోటీలు నిర్వహించినట్లు ఎల్‌డీఎం తెలిపారు.

హవ్వ.. ఎన్ని అబద్ధాలు!


హంద్రీ నీవా కాలువ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్

కుప్పం, ఫిబ్రవరి 26: కుప్పానికి మొత్తం తానే చేశానంటూ సీఎం జగన్ సోమవారం గుండిశెట్టిపల్లె సభలో యథాప్రకారం దబాయించి అబద్ధాలు వల్లించారు. ఒక మారుమూల విసిరేసినట్టుగా ఉండే కుప్పాన్ని తన నియోజకవర్గంగా ఎన్నుకుని సుదీర్ఘకాలంగా నారా చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని చూసిన జనం జగన్ మాటలకు విస్తుపోయారు. జగన్ మాటలనూ, నిజాలనూ ఇక్కడ ఇస్తున్నాం.

జగన్: 'హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తెచ్చింది నేనే'

నిజం: హంద్రీ-నీవా జలాలను తెలుగుదేశం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సుమారు రూ.500 కోట్లు వ్యయం చేసి పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం కృష్ణాపురం దాకా తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి జగన్ నీళ్లు వదిలి ప్రారంభోత్సవం చేసిన ప్రాంతానికి దూరం 20 కిలోమీటర్లు మాత్రమే. ఈ 20కిలోమీటర్లు నీళ్లు తీసుకురావడానికి జగన్‌కు ఐదేళ్లు పట్టింది. సరిగ్గా ఎన్నికలకు ముందు మాత్రమే హడావుడిగా ఈ పని కూడా చేశారు. కొస మెరుపు ఏమిటంటే.. ప్రారంభోత్సవ సమయంలో నీళ్లు కనిపించడం కోసం, కట్టకట్టి నీటిని ఆపి వదిలారు. రాజుపేటలో జగన్ వదిలిన నీళ్లు.. ఆయన ప్రసంగించిన సభ జరిపిన గుండిశెట్టిపల్లె దాకా కూడా చేరుకోలేదు. అయినా నీళ్లు పొలాలను తడిపితే తప్ప జనానికి మేలు చేసినట్టు కాదు.

జగన్: 'కుప్పంను మున్సిపాలిటీ చేసింది నేనే'

నిజం: మున్సిపాలిటీగా మారింది జగన్ ప్రభుత్వంలోనే అయినా అంతకు ముందు జరిగిన కసరత్తు కీలకమైనది. కుప్పంతోపాటు పరిసర ప్రాంతాల్లోని 8 పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, రూర్బన్ పథకం కింద రూ.100 కోట్లను కేంద్ర సాయంతో చంద్రబాబు తీసుకొచ్చారు. మున్సిపాలిటీగా మారితే ఈ నిధులు వెనక్కి వెళ్తాయనే ఉద్దేశ్యంతో, పంచాయతీలను కొనసాగించారు. రూర్బన్ నిధులతో రక్షిత మంచినీటి ట్యాంకులు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చాలా జరిగాయి. మున్సిపాలిటీ అయ్యాక జరిగిన అభివృద్ధి ఏమిటో, తాము కేటాయించామని చెబుతున్న రూ.66 కోట్లతో ఏయే పనులు ఎక్కడెక్కడ చేశారో వైసీపీ నేతలు చెప్పలేకపోతున్నారు.

జగన్: 'కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసింది నేనే'

నిజం: వైసీపీ ప్రభుత్వంలోనే కుప్పం రెవెన్యూ డివిజన్‌గా మారింది. అయితే ఇందువల్ల జనానికి జరిగిన మేలు ఏమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కుప్పానికి 8 కిలోమీటర్ల దూరంలో చంద్రబాబు కట్టించిన న్యాక్ భవనంలోని ఓ గదిలో ఆర్డీవో కార్యాలయం మొక్కుబడిగా కొనసాగుతోంది. కనీసం ఆర్డీవో పేరు కూడా నియోజకవర్గంలో సగం మందికి తెలీదు.

జగన్: 'పోలీసు సబ్ డివిజన్ చేసింది నేనే'

నిజం: ప్రకటించి ఏళ్లు గడిచినా, డీఎస్పీని నియమించింది మాత్రం ఇటీవలే. నియోజకవర్గంలో ఉన్నది నాలుగు మండలాలు. ఇద్దరు సీఐలు ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ఎన్నికలకు ముందు డీఎస్పీ వచ్చారు. అంతే తేడా.

హాజరుకాని ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లను పొందలేకపోయిన ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం నాటి శాంతిపురం సీఎం జగన్ సభలో కనిపించలేదు. చిత్తూరు, పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, ఆదిమూలంను కాదని సీఎం జగన్ ఆమధ్య విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, రాజేష్‌ను కొత్త ఇన్‌చార్జులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎమ్మెల్యేలు అన్నిరకాల ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండానే కొత్త ఇన్‌చార్జులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అధికారులు కూడా వారికి స్వాగతం పలికి వారి సేవలో నిమగ్నమవుతున్నారు. శాంతిపురంలో సోమవారం జరిగిన సీఎం సభా వేదికమీద చిత్తూరు, పూతలపట్టు కొత్త ఇన్‌చార్జులు హడావిడి చేశారు. ఎమ్మెల్యేల తరహాలో వారికి మొదటి వరుసలో స్థానం దక్కింది.


సీఎం జగన్ మాట్లాడుతుండగానే ఖాళీగా దర్శనమిస్తున్న గ్యాలరీలు

జనానికి కష్టం

కుప్పం/శాంతిపురం/రామకుప్పం: సీఎం జగన్ పర్యటన జనానికి కష్టాలు తెచ్చిపెట్టాయి. సోమవారం ఉదయం నుంచి సభ జరుగనున్న శాంతిపురం వద్ద ట్రాఫిక్ మళ్లించారు. బడగుమాకుల పల్లె, విజలాపురం, రామకుప్పం మీదుగా వి.కోట వద్ద ట్రాఫిక్‌ను కలిపారు. ఈ మధ్యలో జాతీయ రహదారి పొడవునా బ్యారికేడ్లు పెట్టి స్థానికులను ఇబ్బందులకు గురిచేశారు. క, ఎమ్మెల్సీ భరత్ ప్రసంగం మొదలు పెట్టగానే జనం వెనుదిరగడం మొదలుపెట్టారు. సీఎం జగన్ ప్రసంగం మొదలు పెట్టాక ఒక్కరొక్కరే బయటకు నడిచారు. 'యాడికి పతా వుండావు అప్పుడే?' అని ఒక మహిళ అంటే, 'అయ్యో, రావే పోదాం, ఇక్కడేముండాది, నామొగం' అని పక్కనున్న మహిళను సభా ప్రాంగణం నుంచి వేరొక మహిళ ఈడ్చుకుపోవడం కనిపించింది. ఇలా వెళ్తున్న వారి సంఖ్య క్రమేణా పెరగడంతో పోలీసులు రోడ్డుమీద బారికేడ్లు అడ్డుపెట్టి నిలువరించడానికి ప్రయత్నించారు. కాసేపు చూసిన జనం, ఆ తర్వాత వారిని తోసుకుని మరీ బయటకు వెళ్లారు. సీఎం ప్రసంగం ముగిసేసరికి సభలో చాలావరకు ఖాళీ కుర్చీలో దర్శనమిచ్చాయి. ఇక, సీఎం ప్రసంగం అరగంటలో ముగుస్తుందనగా పోలీసులు కుప్పం-పలమనేరు రహదారిలో రాకపోకల్ని అడ్డుకున్నారు. చాలాసేపు ఎండలో ఉండాల్సి రావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వచ్చారు. పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నంలో కొందరు కిందపడ్డారు. ఈ క్రమంలో పోలీసులు లాఠీలను ఝుళిపిస్తూ మిగిలిన వారిని అడ్డుకున్నారు. సుమారు గంటసేపు సాగిన సీఎం ప్రసంగం జనాలను ఆకట్టుకోలేకపోయింది. రాష్ట్రం మొత్తం కామన్‌గా ఇస్తున్న సంక్షేమ పథకాలను కూడా కుప్పానికే ప్రత్యేకంగా ఇస్తున్నట్లు వాటి విలువను కోట్లలో లెక్కకట్టి చెప్పడంపైనా జనం నిరాసక్తంగా ఉన్నారు. సీఎం సభ ప్రభావంతో మద్యం ఏరులై పారింది. ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న రాజుపేట రోడ్డులోని నాలుగైదు మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి.


ఫెన్సింగ్ కింద దూరి ముళ్లకంపల్లో బయటకు వెళుతున్న జనం


సీఎం సభకు సమీపంలో మందుబాబుల సందడి


లాఠీలను ఝుళిపిస్తూ జనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సభ బయట ఫొటోలు తీయరాదు

అధికారుల ఆంక్షలు ● బయటకు వెళ్తున్న జనం ఫొటో తీసిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడికి యత్నం

అధికారంలో ఉన్నా అభద్రతలో వైసీపీ నేతలు కూరుకుపోయి ఉన్నారని సోమవారం నాటి సీఎం సభ కవరేజీలో మీడియాపై ఆంక్షలు, అడుగడుగునా నిఘా పెట్టిన తీరు వెల్లడిస్తోంది. ఐ అండ్ పీఆర్ ఆదివారమే ఆంక్షలతో కూడిన ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పబ్లిక్ మీటింగ్ మినహా, అన్ని ప్రాంతాల్లోను ఫొటోస్, వీడియోస్ కవరేజీకి ఐ అండ్ పీఆర్ శాఖకు మాత్రమే అనుమతి కలదు. కావున లైవ్ స్ట్రీమింగ్‌కు సంబంధించి ఫ్రీక్వెన్సీలు, ఫొటోలు ప్రెస్ నోట్లు ఈ గ్రూపులోనే షేర్ చేయడం జరుగుతుంది. దయచేసి పాత్రికేయులు సహకరించగలరు' అని పేర్కొంది. అంటే సీఎం సభ లోపల తప్ప, బయట ఎక్కడా, రోడ్లు, పార్కింగ్ స్థలాలు ఇతర పబ్లిక్ స్థలాలలో ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి లేదన్నమాట. ఎక్కడ ఎవరు మొబైల్‌లో ఫొటోలు తీస్తున్నా వైసీపీ కార్యకర్తలు అనుమానంగా నిలదీయడం కనిపించింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో సభనుంచి వెళ్లిపోతున్న జనాన్ని ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడి చేశాయి. కెమెరాను లాక్కుని అందులోని ఫొటోలను డిలీట్ చేశాయి. ఈ సందర్భంగా పోలీసులు కూడా ఆ మూకలకే వంత పాడాయి. ఏ నిజాలు జనంలోకి వెళ్లిపోతాయో అనే భయం సభ నిర్వాహకుల్లో కనిపించింది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణుల ఘటనపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ఫొటోలు డిలీట్ చేసి, దాడికి ప్రయత్నించడం బాధాకరమని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే సోమవారం ఒక ప్రకటనలో ఖండించింది. రాప్తాడు ఘటన మరువకముందే మళ్లీ దాడి ప్రయత్నం అనేది పత్రికా ప్రపంచానికి గొడ్డలిపెట్టు అని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి అన్నారు. మీడియాపై దాడులను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తీవ్రంగా విమర్శించారు. ఇకపై మీడియా మిత్రులు కవరేజీకి వెళ్లే సందర్భంగా కత్తులు, కర్రలతో వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.

- కుప్పం

పాకాల రైల్వేకాలనీలో దారుణ హత్య

● తలపై బండరాయితో మోది చంపేశారు



పాకాల, ఫిబ్రవరి 26: పాకాల రైల్వే కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సమీపంలో చింతచెట్ల కింద పాకాల పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తిని తలపై బండరాయితో మోది చంపినట్లు స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాకాల ఎస్ఐ2 ఇషాక్ బాషా, రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తిగత ఆధారాలేమీ లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్య నిషేధం ఎక్కడ జగన్?

టీడీఆర్ బాండ్ల బాధితులతో కలసి పోరాటం చేస్తాం

తిరుపతిలో నేడు 'జయహో బీసీ': టీడీపీ

తిరుపతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'మద్య నిషేధం చేశాకే ఎన్నికలకు వస్తానని సీఎం జగన్ చెప్పారు. ఇపుడు ఏ ముఖం పెట్టుకుని జనాన్ని ఓట్లు అడుగుతారు' అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న జగన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఎవరికోసం వేశారో మీడియా సమక్షంలో చూసేందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్లలో భారీ కుంభకోణం జరిగిందని, నిజమైన బాధితులతో కలసి పోరాటం చేస్తామన్నారు. దొంగ ఓట్లతో గెలిచేందుకు వైసీపీ అభ్యర్థి అప్‌డేట్ అయ్యారని ఆరోపించారు. కుమారుడిని ఎమ్మెల్యే చేసేందుకు కరుణాకర రెడ్డి బూటకపు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని ఇందిరా మైదానంలో మంగళవారం ఐదు గంటలకు జయహో బీసీ కార్యక్రమం జరగనుందన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులతోపాటు చేతివృత్తులు, కులసంఘాల వారు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. బీసీలందరూ ఒకేతాటిపై నిలిచి చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమావేశం జరిగే మైదానాన్ని పరిశీలించారు. ఎన్నికల పరిశీలకుడు చినబాబు, క్లస్టర్ ఇన్‌చార్జులు, రాష్ట్ర, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



గుట్టపాళ్యం, గూబలవారిపల్లె సమీపంలో పొలాల్లో ఏనుగుల పాదముద్రలు, ధ్వంసమైన వరి

పాకాల, ఫిబ్రవరి 26: పాకాల, ఐరాల మండలాల సరిహద్దులో మొరవపల్లె, కాకర్లవారిపల్లె, గుట్టపాళ్యం, గూబలవారిపల్లె, వేదగిరివారిపల్లె సమీపంలోని పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గూబలవారిపల్లెకు చెందిన సేతురాం, వేదగిరివారిపల్లెకు చెందిన శివాజి, గుట్టపాళ్యంకు చెందిన విజయనాయుడులకు చెందిన వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. గుట్టపాళ్యం విజయనాయుడు వరిపొలంవద్ద నున్న బావిలో ఓ గున్న ఏనుగు పడిపోగా.. దానిని రక్షించి పెద్ద ఏనుగులు తీసుకెళ్లిపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రదేశమంతా ఏనుగులు తొక్కేయడంతో వరిపంట ధ్వంసమైంది. పంటపొలాలపై కొన్ని నెలలుగా వరుస దాడులతో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నా.. సంబంధిత అటవీ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏనుగుల బెడద తప్పించాలని కోరుతున్నారు.

'పద్మావతి' ఆస్పత్రిలో 1 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

● తిరుమలలోని క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం
● తిరుపతిలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం ● టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి ఒకటినుంచి ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్ వంటి ప్రత్యేక విభాగాలతోపాటు జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి సాధారణ వ్యాధులకూ వైద్యసేవలు అందిస్తారన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులతో కలిసి బోర్డు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. టీటీడీలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీల్లోని సిబ్బందికి, వర్క్ కాంట్రాక్ట్ పరిధిలోని ఎఫ్ఎంఎస్, పారిశుధ్య సిబ్బందికి తిరుమలలోని ఉద్యోగుల క్యాంటీన్‌లో రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఉద్యోగుల క్యాంటీన్‌లో వంటశాల, భోజనశాల విస్తరణకు రూ.8.15 కోట్లు, అవసరమైన వంట సామగ్రి కొనుగోలుకు రూ.3కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. అన్నప్రసాద విభాగంలో సూపర్‌వైజరీ పోస్టుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు నిర్ణయించామని, అలాగే కిందిస్థాయి పోస్టులను కార్పొరేషన్ లేదా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకానికి ఆమోదం తెలిపామని చెప్పారు.

హాకర్ లైసెన్సు రెన్యువల్స్‌పై..?

తిరుమలలో దాదాపు 30 ఏళ్ల క్రితం గడువుచెల్లిన హాకర్ లైసెన్సు రెన్యువల్స్, దుకాణాల స్థల మార్పిడి అంశాలను కూడా బోర్డు అజెండాలో పొందుపరిచినట్టు తెలిసింది. అయితే వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారనే విషయం బయటకు వెల్లడి కాలేదు.

మరికొన్ని నిర్ణయాలిలా..

- టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి పుట్టినరోజును ప్రతి ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన నిర్వహించాలని నిర్ణయం. టీటీడీ క్యాలెండరులోనూ ఈ రోజును చేర్చాలని తీర్మానం.
- టీటీడీ అటవీ విభాగంలో విధులు నిర్వహిస్తూ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌లో ఉన్న ఉద్యోగులను తిరిగి వారి సొసైటీలకు బదిలీ చేసి, వేతనాలు పెంచి, బస్సు పాసులు ఇచ్చేందుకు ఆమోదం.
- వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఔట్, ఇతర అభివృద్ధి చార్జీలకు సంబంధించి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం. ఈమొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- శ్రీలంకలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహణకు నిర్ణయం.
- తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి భవనంలో 1, 4వ బ్లాకుల ఆధునికీకరణకు రూ.3.19 కోట్ల మంజూరుకు ఆమోదం.
- పాపవినాశనం, కుమారధార, పసుపుధార, ఇతర ప్రాంతాల్లోని 682 మోటార్ పంపు సెట్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు రూ.3.15 కోట్ల మంజూరు.
- తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అతిథి భవనాలు, పీఏసీలో ఎఫ్ఎంఎస్ సేవలు మరో మూడేళ్ల పొడిగింపు.
- తిరుపతిలోని శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవర్లకు నూతన బంగారు కవచాల తయారీకి ఆమోదం. రూ.15లక్షలతో రెండు తండ్లకు బంగారు మలాం వేసిన కాపర్ రేకులు ఏర్పాటు.
- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గత ఏడాది తరహాలోనే జాతర నిర్వహణకు రూ.50లక్షల మంజూరుకు ఆమోదం.
- టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ పదవీ కాలం మరో మూడేళ్ల పొడిగింపు.
- జమ్మూలో నిర్మించిన శ్రీవారి ఆలయంలో పనిచేసే సిబ్బందికి హెచ్ఆర్ఏ పెంపునకు ఆమోదం.
- తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఇన్‌కమ్ ట్యాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం.
- అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దనున్న ముగ్గుబావుల ఆధునికీకరణకు నిర్ణయం.


టీటీడీ బోర్డు సభ్యులతో సమావేశమైన చైర్మన్ కరుణాకరరెడ్డి

ముక్కంటి సేవలో రష్యా భక్తులు


రాహు-కేతు పూజల్లో పాల్గొన్న రష్యన్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఆలయాన్ని సోమవారం రష్యా భక్తులు దర్శించుకున్నారు. 15 మంది రష్యా భక్తులు ముందుగా ఆలయంలో రాహు-కేతు సర్పదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయంలోని పగడ చెట్టు వద్ద బయట నుంచి శివనామ స్మరణ చేశారు. స్థానిక భక్తులు విదేశీయులతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



బాలాయపల్లి మండలంలో ఆటోలో వెళుతున్న విద్యార్థులు

గూడూరు, ఫిబ్రవరి 26: సీఎం జగన్ ఎక్కడ బహిరంగ సభ జరిగినా ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. సభ జరిగే ప్రాంతంతో పాటు పక్క జిల్లాల్లోని ఆర్టీసీ డిపోల నుంచి కూడా అత్యధిక బస్సులన్నీ జనాన్ని తరలించడానికి మళ్లిస్తున్నారు. ఈనెల 18వ తేదీన అనంతరపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు గూడూరు డిపో నుంచి 30 బస్సులను తరలించారు. అప్పుడు మూడు రోజులపాటు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. సోమవారం కుప్పంలో సీఎం పర్యటనకు ఆదివారం ఉదయమే గూడూరు డిపో నుంచి 20 బస్సులను జనసమీకరణకు తరలించారు. ప్రయాణికులకు తగినన్ని బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో గూడూరు నుంచి నెల్లూరు, తిరుపతి, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. వచ్చిన బస్సుల్లోనే రద్దీ కారణంగా నిలబడి ప్రయాణాలు సాగించాల్సి వచ్చిందని ప్రయాణకులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాలాయపల్లి: బాలాయపల్లి మండలంలో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. బాలాయపల్లి మండలంలోని వెంకటరెడ్డిపల్లి, గూడూరు మండలం గొల్లపల్లి, నెన్నూరు, కొమ్మనేటూరు, తిరువెంగళామపల్లి, చెమిర్తి, తిప్పవరపాడు గ్రామాల నుంచి విద్యార్థులు బస్సుల్లో బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం ఆర్టీసీ బస్సులను కుప్పంలో సీఎం సభకు మళ్లించడంతో వెంకటగిరి - గూడూరు మార్గంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడ్డారు. పాఠశాలకు వెళ్లేందుకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

కోట పట్టణాన్ని మున్సిపాలిటీ చేస్తాం: పాశం



సునీల్‌కు హారతి పడుతున్న మహిళలు

కోట, ఫిబ్రవరి 26: కోట పట్టణాన్ని అధునాతన వసతులతో మున్సిపాలిటీగా మార్చుతామని గూడూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని బజారుసెంటర్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మహిళలు భారీగా తరలివచ్చి సునీల్‌కుమార్‌కు కర్పూర హారతులు ఇచ్చారు. అక్కడ నుంచి బజారు మెయిన్ సెంటర్, ఆర్టీసీ సెంటర్లల్లో గల దుకాణాలు, ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కోట పట్టణాన్ని రూ.12 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, పలగాటి భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, మధుయాదవ్, దారా సురేష్, షంషుద్దీన్, నౌషాద్, మర్రి పోలయ్య, అనిల్, మస్తాన్‌బాషా, రాధాకృష్ణారెడ్డి, వాకా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై నమ్మకంతోనే పార్టీలో చేరికలు

గూడూరు, ఫిబ్రవరి 26: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు నమ్మి పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక అశోక్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద గాంధీనగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడం పనిగా పాలన సాగిస్తోందన్నారు. అవినీతిని ప్రశ్నించేవారిపై దాడులకు దిగుతూ అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేలా చంద్రబాబునాయుడు మినీ మేనిఫెస్టో రూపొందించారన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, ఉదయ్, కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, బాబు, కృష్ణ, గోవిందయ్య, వెంకటేశ్వర్లు, రవి, వెంకయ్య, మల్లి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపండి

వెంకటగిరి, ఫిబ్రవరి 26: పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో బాబు ష్యూరిటీ - భవిషత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధనాయుడు, శ్రీరామదాసు గంగాధర్, అవ్వారు సత్యనారాయణ, సుదా, మల్లారం బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

కోట, ఫిబ్రవరి 26: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షా ప్రశ్నపత్రాలు సోమవారం కోట పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. డిపార్ట్‌మెంట్ అధికారులు రాజ్‌కుమార్, సుమలత, విజయకుమార్, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు సమక్షంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

బాబుతోనే రాష్ట్ర ప్రగతి: మస్తాన్ యాదవ్



మేనిఫెస్టో గురించి మహిళలకు వివరిస్తున్న మస్తాన్ యాదవ్

వెంకటగిరి, ఫిబ్రవరి 26: రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని 3వ వార్డు గిరిజన కాలనీలో పట్టణ పలుకరింపు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై దాడులను మానుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 26: ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం రైతులపై కొనసాగిస్తున్న దాడులను మానుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హర్యానా, ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరిపి ఓ యువరైతు మరణానికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ స్వామినాధన్ సిఫార్సులను అమలు చేయడంతో పాటు రైతులకు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. అలాగే పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, ప్రభాకర్, బీవీ రమణయ్య, సురేష్, శశికుమార్, కాలేషా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటులో జాప్యం తగదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: మీటర్ల ఏర్పాటులో జాప్యం తగదంటూ వైసీపీ నేత, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ పొగగొట్టం కాలనీ వాసులతో కలిసి సోమవారం నాయుడుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇళ్లకు మీటర్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల సూచనల మేరకు కాలనీ వాసులు మీటర్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు. అయితే మీటర్లు ఇవ్వకుండా జాప్యం చేయడం తగదన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాలాయపల్లి, ఫిబ్రవరి 26: మండలంలోని పెరిమిడి గ్రామంలో వీధి లైటు ఒకరి ఇంటివైపు మళ్లించుకున్నారనే వివాదంతో రెండువర్గాలు ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతిచెందిన అప్జల్

గూడూరు, ఫిబ్రవరి 26: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన ఘటన గూడూరు పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.... స్థానిక మసీదువీధిలో కాపురం ఉంటున్న అప్జల్(52), అల్లాబక్షు పెయింట్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సోమవారం సనత్‌నగర్‌లో ఓ ఇంటికి రంగులు వేస్తుండగా సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్జల్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లాబక్షును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు పరిహారమేదీ?

- స్వర్ణముఖి వరదతో పంటలన్నీ నీటిపాలు
- ఇసుక మేటలతో నిండిన పొలాలు
- మూడు నెలలైనా అందని పరిహారం



వరద ఉధృతికి ఇసుక మేటలతో నిండి వరి పొలం

వాకాడు, ఫిబ్రవరి 26: వరద ముంచేసి.. మూడు నెలలు కావస్తోంది... రబీ సీజన్ ముగింపు దశకు వచ్చేసింది. పంట పొలాలు స్వర్ణముఖి ఉగ్రరూపానికి కోతకు గురై ఇసుక మేటలుగా మారాయి. ఇప్పటికీ బాధితులకు నష్టపరిహారం అందకపోవడంతో రైతులకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వాకాడు మండలంలో మొలగనూరు, వాకాడు, కొండాపురం, తిరుమూరు, ముట్టెంబాక, కోడివాక తదితర గ్రామాల్లో 62 హెక్టార్లల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే కేవలం రూ.11.17 లక్షలు మాత్రమే పంటనష్టం జరిగినట్లు నివేదిక పంపారు. నిజానికి రైతులకు జరిగిన నష్టం కోట్లలో ఉంది. వరద ముంపునకు గురైన పొలాలన్నీ ఇసుక మేటలుగా మారడంతో వాటిని చదునుచేసి పంటలు వేయాలి. అయితే మూడు నెలలుగా ఎదురు చూస్తున్నా పరిహారం అందకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నష్టం పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ త్వరలోనే నష్ట పరిహారం అందుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. మూడు నెలలు కావస్తున్నా పైసా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పరిహారం త్వరగా అందేలా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాబుతోనే యువతకు బంగారు భవిత: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 26: చంద్రబాబుతోనే యవతకు బంగారు భవిత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమంపై సోమవారం తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు పేద విద్యార్థుల విదేశీ విద్యకు ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేస్తే, జగన్ అధికారంలోకి రాగానే నీరుగార్చారని విమర్శించారు. ఐటీ మంత్రిగా నారా లోకేశ్ రాష్ట్రంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చి యువత ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం కొత్త పరిశ్రమలను తీసుకురాక పోగా ఉన్న వాటినీ తరిమేసిందని ఆరోపించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7903 మంది యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కు లభించిందన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, చంటీ, బాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సర్వే చేయించండి: షాలినీ రత్నం



మీడియాతో మాట్లాడుతున్న షాలినీ రత్నం

నాయుడుపేట, ఫిబ్రవరి 26: టికెట్ల కేటాయింపు కోసం మరోసారి సర్వే చేయించాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం కుమార్తె షాలినీ రత్నం విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్లుగా టీడీపీ కోసం తమ కుటుంబం ఎంతో కష్టపడిందని, 2009 నుంచి ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేశామని గుర్తుచేశారు. టీడీపీ నిర్వహించిన సర్వేలో తమ పేర్లను పరిశీలించలేదని, పైగా పార్టీ కోసం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించని మహిళకు టికెట్ కేటాయించడం తమను బాధించిందన్నారు. అధిష్ఠానం మరోసారి సర్వే నిర్వహిస్తే ఎవరికి ప్రజాభిమానం ఉందో బయటపడుతుందని షాలినీ రత్నం అన్నారు.

మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని పెట్లూరులోని సర్వే నెంబరు 1లో 238, 12-1లో 519 ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య అన్నారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా గిరిజనులు భూములను సాగు చేస్తుంటే అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇదే సర్వే నెంబరులో అనేక మంది భూస్వాములకు పట్టాలు ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పద్మమ్మ, గోపాల్, రమణయ్య, లోకనాథం, సుబ్బు, రామయ్య, రేణుక పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మార్కెట్ వేలం

నాయుడుపేట, ఫిబ్రవరి 26: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయాల మార్కెట్, తోపుడు బండ్లు, గంపలు, మూటలు, ప్రైవేట్ బస్సులు, లారీల నుంచి రుసుము వసూలు చేసుకునేందుకు సోమవారం కమిషనర్ జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. కూరగాయాల మార్కెట్ రుసుం వసూలు హక్కులను ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి రూ.12.57 లక్షలకు, తోపుడుబండ్లు, గంపలు, మూటలకు రుసుం వసూలు హక్కులను ఎస్.చిట్టిబాబు రూ.2.47 లక్షలకు, బస్టాండ్ వద్ద ప్రైవేట్ బస్సులు, లారీలు నిలుపుదల రుసుం వసూలు హక్కులను జి.కళ్యాణి 1.58 లక్షలకు వేలం పాటలో పాడుకున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి తిరోగమనం

నాయుడుపేట, ఫిబ్రవరి 26: వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి తిరోగమనంలో ఉందని సూళ్లూరుపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ బొల్లకాయల విజయభాస్కర్ అన్నారు. నాయుడుపేట మండలం జువ్వలపాళెం, విన్నమాల గ్రామాల్లో సోమవారం ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొప్పోలు సుబ్రహ్మణ్యం, దువ్వూరు మధురెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి

కోట, ఫిబ్రవరి 26: పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏవో సుచేంద్రప్రసాద్ ఆదేశించారు. కోటలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం సహాయ వ్యవసాయశాఖ అధికారులతో పంటల నమోదుపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏవో నిరంజన్‌కుమార్, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

విజయశ్రీ గెలుపు కోసం కృషి



డాక్టర్ విజయశ్రీని కలసి సత్కరిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 26: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ గెలుపు కోసం కృషి చేస్తామని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం నాయకులు చెప్పారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, నాయకులు సోమవారం నాయుడుపేటలో నెలవల సుబ్రమ్మణ్యం, డాక్టర్ విజయశ్రీలను కలసి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు కలవకోలు మునీష్, సర్పంచులు గుంటపూడి పెంచలయ్య, కలపాటి పుల్లమ్మ, కలవకోలు అమరావతి, నాయకులు శిరసనంబేటి సుధాకర్‌రెడ్డి, మీరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నాయుడుపేట, ఫిబ్రవరి 26: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొప్పోలు సుబ్రహ్మణ్యం, మున్సిపల్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, వైద్యాధికారి, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 26: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం గూడూరు మండలంలోని పొదుపు మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్ర, పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, బాబురెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గూడూరు, ఫిబ్రవరి 26: మండలంలోని మేగనూరు గ్రామంలో ఉన్న త్రిలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శివలింగప్రతిష్ట, కలశస్థాపన, హోమపూజలు, కుంభాభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గొర్ల రమేష్, కృష్ణయ్య, తిరుపాలయ్య, శ్రీనివాసులు, రమణయ్య ఉన్నారు.

రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డికి సన్మానం



వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని సన్మానిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ సన్మానించారు. సోమవారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో వేమిరెడ్డిని కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నెలవల సుబ్రహ్మణ్యం, నెలవల రాజేష్, పార్థసారధి ఉన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

చిల్లకూరు, ఫిబ్రవరి 26: మండలంలోని చింతవరం రేస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిందాల్ పరిశ్రమ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను పరిశ్రమ ప్రతినిధులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మంజూరి, సరోజ్‌పాడి విల్సన్, జోబిన్, సంపత్‌కుమార్, వెంకటసుబ్బయ్య, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

కోట, ఫిబ్రవరి 26: కోటలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఎంఈవో మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హెచ్‌ఎం ప్రమీల, వెంకటరావు, పూర్ణానందబాబు పాల్గొన్నారు.

హెఐవీ నిర్మూలనపై అవగాహన

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని ఏపీటీఎఫ్ కాలనీ, రైల్వేస్టేషన్, కాశీపేట ప్రాంతాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం సహకారంతో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెఐవీ నిర్మూలనపై అవగాహన కల్పించారు. నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ అసురక్షితమైన లైంగిక క్రియలు, రక్త మార్పిడి, కలుషితమైన సిరంజిలు, ఎయిడ్స్ సోకిన తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ వస్తుందని తెలిపారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో కవిత, కల్పన, శిరీష, నళిని, కవిత, రెడ్డెప్ప, హరినాథ్, గురప్ప, నారాయణ, కవిత, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

కోట, ఫిబ్రవరి 26: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి ఏపీడీ వరప్రసాద్‌రెడ్డి క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. వేసవికాలంలో గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులను గ్రామసభల ద్వారా గుర్తించాలన్నారు. ఎక్కడైన లోపాలు జరిగితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, సీఏలు శాంతి, భాస్కర్‌బాబు, చంద్రశేఖర్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని 8వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నేదురుమల్లి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 26: కుప్పం పర్యటన కోసం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న సీఎం జగన్‌ను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన నాయుడుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... పెళ్లకూరు మండలం చావాలి గ్రామానికి చెందిన రమేష్(35) నాయుడుపేటలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల కుటుంబ కలహాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో రమేష్ మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం శ్రీరామకాలనీ మెయిన్ వీధి వద్ద రమేష్ పడిపోయి ఉండటంతో గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని రమేష్‌ను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పాత ఇనుప సామాన్ల దుకాణం దగ్ధం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 26: నాయుడుపేటలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణం దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు... పట్టణానికి చెందిన ఎండీ ఫరూక్ కొంత కాలంగా పాత సామాన్ల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాగు. అర్ధరాత్రి దుకాణంలో మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

వాకాడు, ఫిబ్రవరి 26: మండలంలోని స్త్రీశక్తి భవనంలో సోమవారం అంగన్వాడీ, వైద్య సిబ్బందికి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఆయా గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, ఐసీడీఎస్ సిబ్బంది భాగస్వామ్యం అవుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల గురించి టోల్‌ఫ్రీ నెంబరు 1098కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రి వైద్యులు దీప్తి, కమలశ్రీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌వన్నీ ఉత్తుత్తి హామీలే: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 26: అధికారంలోకి రావడం కోసం జగన్ ఉత్తుత్తి హామీలు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక 14వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపానం నిషేధం అమలు చేస్తామని మాట చెప్పి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాశికరం బ్రాండ్ల అమ్మకాలతో కోట్ల రూపాయలు దోచుకుంటోందని ఆరోపించారు. నాశిరకం మద్యం తాగిన పేదలు ఆస్పత్రులు పాలై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, శ్రీధర్, కల్పన, దయాకర్, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, సందీప్, శైలజ, అమరయ్య, జనార్ధనరెడ్డి, గాయం రమణయ్య, పార్వతయ్య, సునీల్, వెంకటేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనల ప్రారంభం

గూడూరు, ఫిబ్రవరి 26: మండలంలోని దివిపాళెం సమీపంలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అండర్ పాస్‌ను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రైల్వే జీఆర్‌పీ సీఐ భుజంగరావు, పొన్నంబల్, పిట్టి నాగరాజు, షర్మిల, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలో మినమలమూడి, పోలిరెడ్డిపాలెం, అక్కరపాక, నేతాజి నగర్, దొరవారిసత్రం, నెలబల్లి గ్రామాల వద్ద నిర్మించిన రైల్వే వంతెనలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వే అధికారులు సచిన్ పుతిన్ సింగ్, చలపన్, జాయ్, ఎస్ఐ తిరుమలరావు, ఎంఈవో కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: ఆధునికీకరించిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, రైల్వే అధికారులు ఇస్లాం, మురళికృష్ణ, స్థానిక నాయకులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, కోటయ్య గౌడ్, నూతల పాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్దతిలో ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

బాలాయపల్లి, ఫిబ్రవరి 26: బాలాయపల్లిలోని సర్వే నంబరు 121-1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఆ భూమిని కాపాడాలని సర్పంచు దట్టం అంజలి ఆర్డీవో కిరణ్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.